అంజన్న దర్శనం కోసం తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలు



భక్తులతో కిటకిటలాడిన గండి క్షేత్రం

చక్రాయపేట, ఆస్టు 17: రెండవ శ్రావణ శనివారం గండి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసంలో అంజన్న దర్శనం కోసం భక్తులు తండోపతండాలుగా వస్తుంటారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయాన్నే పాపాఘ్నిలో స్నానాలు చేసి అంజన్న దర్శనం కోసం క్యూలలో నిలబడ్డారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3.30గంటల వరకు రద్దీ కొనసాగింది. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య అన్ని ఏర్పాట్లు చేశారు. భారీగా భక్తులు రావడంతో స్వామి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. దేవస్థానం ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు అన్నదానం చేశారు. ప్రధాన అర్చకులు కేసరి, ఉప్రప ధాన అర్చకులు రాజారమేశ్‌లు అంజన్నను తోమాలలతో అలంకరించారు. టీటీడీ వారు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన హరికథ కాలక్షేపాలు, భజనలు, కోలాటాలు భక్తులను అలరించాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ రంగనాయకులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫ్రీహోల్డ్‌లో 9 వేల ఎకరాలకు అనర్హత

● మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్



ఫ్రీహోల్డ్ భూముల రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

కలికిరి, ఆగస్టు 17: మదనపల్లె డివిజనలో ఇప్పటికి తొమ్మిది వేల ఎకరాల ఫ్రీహోల్డ్ భూము లు అనర్హతగా తేలినట్లు సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫ్రీహోల్డ్ పూర్తయిన 1500 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయని గుర్తించినట్లు పేర్కొన్నారు. మొత్తం 48 వేల ఎకరాలకు ఫ్రీహోల్డ్‌లో రికార్డులు మార్చారని.. అందులో 22 వేల ఎకరాలకు సంబంధించిన రికార్డుల పరిశీలన పూర్త యినట్లు చెప్పారు. మండలంలో ఫ్రీహోల్డ్ భూముల పరిశీలనలో పలు అంశాలపై వివరణ ఇవ్వడంలో వీఆర్వోలు సరైన అవగాహన లేకుండా పనిచేశారని సబ్ కలెక్టరు తెలిపారు. కొంత మంది వీఆర్వోలు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆయన అసహనానికి గురయ్యారు. వివిధ రకాల సమాచారాన్ని ఎలా పొందుపర్చాలో వీఆర్వోలకు విశదీకరించారు.

ముగ్గురు వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు

మండలంలో ముగ్గురు వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సిందిగా సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ తహసీల్దారును ఆదేశించారు. ఫ్రీహోల్డ్ భూములు, సూమోటో కులం సర్టిఫికెట్ల విషయంలో ఉద్దేశపూర్వకంగా, బాధ్యతా రాహిత్యంతో వ్యవరించినందుకు గుట్ట పాలెం, పత్తేగడ, మర్రికుంటపల్లె వీఆర్వోలు కదిరప్ప, సుధాకర్, కృష్ణప్పలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మరో ఇద్దరు వీఆర్వోలు కూడా పొంతన లేకుండా సమాధానా లిస్తున్నారని.. వారి పనితీరును మరోసారి పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశిం చారు. సమావేశంలో తహసీల్దారు మహేశ్వరీ భాయి, డీటీ నవీన్, రీ సర్వే ప్రత్యేక డీటీ, ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.

గంజాయి, సారా, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలి : ఎస్పీ



రాయచోటిటౌన్, ఆగస్టు17: జిల్లాలో గంజాయి, నాటుసారా, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారు లను ఆదేశించారు. శనివారం సాయంత్రం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్ఈబీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అక్రమ మద్యం, నాటుసారా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై క్షేత్రస్థాయిలో ముందస్తు సమాచార వ్యవస్థను మెరుగుపర్చుకొని నిరంతరం దాడులు చేపట్టి సమూలంగా అరికట్టాలన్నారు. జిల్లాలోని సెబ్ పోలీస్ స్టేషన్‌ల వారీగా పెండింగ్ కేసులు సమీక్షించి.. ఆయా కేసుల దర్యాప్తులో పురోగతి, ముద్దాయిల అరెస్టులపై ఆరా తీసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామాల్లో నాటుసారా విక్రయ కేంద్రాలను గుర్తించి పోలీసులు, ఎస్ఈబీ సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం జిల్లాలోకి అక్రమంగా ప్రవేశించకుండా సరిహద్దు స్టేషన్లలో గట్టి నిఘా పెంచాలన్నారు. అక్రమంగా తరలిస్తున్న గంజాయిపై ప్రత్యేక దృష్టి సారించి.. జిల్లాలో గంజాయి ఆనవాళ్లు, అవశేషాలు లేకుండా సమూలంగా అరికట్టాలన్నారు. మాదక ద్రవ్యా లతో కలిగే దుష్ప్రభావాలపై కాలేజీల్లో విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించా లన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండిండెంట్ శ్రీనివాసులునాయుడు, జిల్లాలోని సెబ్ ఇన్‌స్పెక్టర్‌లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బెరైటీస్‌లో అక్రమాలపై
సమగ్ర విచారణ జరపాలి

● డీఐజీ ప్రవీణ్‌కు ఎమ్మెల్సీ వినతి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 17: ఓబులవారిపల్లె మండలం మంగంపేట బెరైటీస్‌లో జరిగిన అక్రమాలపై గతంలో నమోదు అయిన కేసులో సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నమయ్యజిల్లా ఓబులవారిపల్లె మండలంలో మంగంపేట వద్ద బెరైటీస్ గనులున్నాయన్నారు. 2019-24 మధ్య కాలంలో కొందరు రాజకీయ బలంతో ముగ్గురాయిని అనధికారికంగా తరలించి వందల కోట్లు ఆర్జించారన్నారు. ప్రధానంగా ఏ గ్రేడ్ ఖనిజాన్ని దొంగతనం చేసి ఎక్స్‌పోర్టు చేశారని, కొందరు ఉద్యోగుల సహకారంతో కొన్ని ఎక్స్‌పోర్టు కంపెనీలు వేల టన్నులను తరలించాయన్నారు. 2023 ఏప్రిల్ 19న ముగ్గురాయి చోరీకి గురయిందని ఈ మేరకు 2023 మే 9న ఏపీఎండీసీ అధికారులు ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ కేసులో దర్యాప్తు సరిగా జరగలేదని అసలు సూత్రధారులను విచారించలేదని తెలిపారు. గనుల నుంచి ఖనిజం బయటకు తెచ్చే ప్రతి వాహనానికి జియోట్యాగ్ ఉంటుందని, లోడ్ ఎత్తుకున్న తర్వాత లారీ ఎక్కడ నుంచి ఎక్కడకి పోయేదన్నది సాంకేతికంగా కనుక్కోవచ్చన్నారు. ఎవరికి ఈ ఖనిజం వెళ్లిందన్నది కూడా స్పష్టంగా తెలుసుకోవచ్చన్నారు. గత ఐదేళ్లలో లక్షల టన్నుల ఖనిజం ఎక్కడ నుంచి ఎక్కడికి పోయిందన్నది దర్యాప్తు చేయలేదని, ఈ కేసులో లారీల విషయం కానీ, ఎవరు కొన్నారనేది తేల్చలేదన్నారు. దర్యాప్తు కంటి తుడుపుగా జరిగిందని ఈ వ్యవహారంలో వందల కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. ఈకేసుపైన సమగ్ర దర్యాప్తు చేయాలని అసలు సూత్రధారులను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు.



ఫ్రీహోల్డ్ రీవెరిఫికేషన్‌లో..
వింతలు, విడ్డూరాలు

● రైతులు దరఖాస్తు చేయకుండానే ఫ్రీహోల్డ్‌లోకి..

● చనిపోయిన భూ యజమానులు దరఖాస్తు చేసిన వైనం

● ఫీల్డ్ విజిట్ చేయకుండానే వేల ఎకరాలు ఫ్రీహోల్డ్‌లోకి..

● ఆచితూచి రీవెరిఫికేషన్ చేస్తున్న రెవెన్యూ అధికారులు



మదనపల్లె టౌన్, ఆగస్టు 17: మదనపల్లె ఫైల్స్ ఎఫెక్ట్‌తో జిల్లాలో ఫ్రీహోల్డ్ భూముల రీ వెరిఫికేషన్ జరుగుతున్న నేపథ్యంలో మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. తాము దరఖాస్తు చేయకుండానే తమ భూములు ఫ్రీ హోల్డ్‌లోకి ఎలా వచ్చాయని కొందరు భూ యజమానులు ప్రశ్నిస్తుంటే, చనిపోయిన భూ యజమానులు కూడా ఫ్రీహోల్డ్ కోసం దరఖాస్తు చేసుకున్న వైనం విస్తుగొలుపుతోంది. అప్పటి ప్రభుత్వం హడావుడిగా ఫ్రీహోల్డ్ తంతు ప్రారంభించడం.. ఎన్నికల ముందు, వైసీపీ నాయకులు విలువైన భూములను కొనుగోలు చేసి ఫ్రీహోల్డ్‌కు దరఖాస్తు చేయడం, ఉన్నతా,ధికారుల ఆదేశాలతో ఆగమేఘాల మీద వాటికి ఫ్రీహోల్డ్ జాబితాలో ఎక్కించిన విషయాలు బయటపడుతున్నాయి.

ఫీల్డ్ వెరిఫికేషన్ లేకుండానే..

వైసీపీ ప్రభుత్వం గత డిసెంబర్‌లో విడుదల చేసిన జీవో నెంబర్ 596తో అక్రమార్కుల అవినీతికి రెక్కలు వచ్చాయి. రెవెన్యూ అధికారులను నయానో..భయానో లొంగదీసుకుని కొన్ని ప్రాంతాల్లో విలువైన భూములను నిషేధిత జాబితాతో తొలగించి, ఫ్రీహోల్డ్‌లో పెట్టించుకున్నారు. కనీసం రెవెన్యూ అధికారులు(వీఆర్ఏ, వీఆర్వో, ఆర్ఐ, డీటీలు) క్షేత్రస్థాయిలో వెళ్లి భూ వివరాలు, రైతుల వివరాలు పరిశీలించకుండానే దరఖాస్తు చేసిన భూములన్నింటిని ఫ్రీహోల్డ్‌లో పెట్టేశారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని మదనపల్లె మండలంలో 2971 సర్వే నెంబర్లలో 3,620 ఎకరాలు, నిమ్మనపల్లె మండలంలో 1114 సర్వేనెంబర్లలో 1,739 ఎకరాలు, రామసముద్రంలో 926 సర్వే నెంబర్లలో 759 ఎకరాలు, ములకలచెరువులో 3,613 సర్వే నెంబర్లలో 3,227 ఎకరాలు, పెద్ద మండ్యంలో 6,296 సర్వే నెంబర్లలో 9,293 ఎకరాలు, కురబలకోటలో 2,861 సర్వేనెంబర్లలో 3,704 ఎకరాలు, పీటీఎంలో 5,348 సర్వే నెంబర్లలో 7,494 ఎకరాలు, బి.కొత్తకోటలో 5,377 సర్వే నెంబర్లలో 6,162 ఎకరాలు, తంబళ్లపల్లెలో 3,844 సర్వేనెంబర్లలో 4,153 ఎకరాలు, పీలేరు నియోజకవర్గం వాల్మీకిపురంలో 2,404 సర్వేనెంబర్లలో 3,477 ఎకరాలు, కలికిరి మండలంలో 3,662 సర్వే నెంబర్లలో 4,641 ఎకరాలు మొత్తం మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో 38,416 సర్వేనెంబర్లలో 48,273 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు ఫ్రీహోల్డ్‌లో ఎక్కించారు. అలాగే రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో 14,305 సర్వేనెంబర్లకు 27,643 ఎకరాల భూమిని, రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో పెద్దమొత్తంగా 40,806 సర్వేనెంబర్లలో ఏకంగా 59,596 ఎకరాల భూమిని అప్పటి అధికారులు ఫ్రీహోల్డ్ జాబితాలో ఎక్కించేశారు.

వెలుగు చూస్తున్న వింతలు, విడ్డూరాలు

మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైల్స్ దహనం ఘటన తరువాత కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో వైసీపీ నాయకుల భూ పందేరాల చిట్టా ఒక్కొక్కటి బయటపడుతుండటంతో ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ భూముల వివరాలను రీ వెరిఫికేషన్‌కు నిర్ణయించింది. ఈ క్రమంలో గత 15 రోజులుగా జిల్లాలోని అన్ని మండలాల్లో రీ వెరిఫికేషన్‌ను వీఆర్‌వోలు క్షేత్రస్థాయిలో వెళ్లి భూములు, రైతుల వివరాలు సేకరిస్తున్నారు. డివిజన్‌లోని చాలా మండలాల్లో కొందరు భూయజమానులు మృతి చెందినా వారి పేరుతో ఫ్రీహోల్డ్‌కు దరఖాస్తు చేసిన వైనం బయటపడుతోంది. కొందరు రైతులైతే తాము ఫ్రీహోల్డ్‌కు దరఖాస్తు చేయకున్నా, తమ భూములు ఫ్రీహోల్డ్‌లో ఎలా పడ్డాయని రెవెన్యూ అధికారులను ఆశ్చర్యంగా ప్రశ్నిస్తున్నారు. మృతి చెందిన భూ యజమానుల వారసుల పేరుతో పాసుపుస్తకాలను మ్యుటేషన్ చేయ కుండానే, వారి పేరుతో ఫ్రీహోల్డ్ జాబితాల్లో పెట్టేశారు. అంతే కాకుండా ఫ్రీహోల్డ్‌లో పెట్టిన భూముల విస్తీర్ణం, రికార్డుల్లోని విస్తీర్ణంలో కూడా తేడాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల తాము డీకేటీ, చుక్కల భూములు ఇతరులకు విక్రయించకుండానే, తమ పేర్లు ఎలా ఫ్రీహోల్డ్‌లోకి వచ్చాయని రైతులు అధికారులను నిలదీస్తున్నారు.

దళారుల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టు..

దరఖాస్తు పట్టా భూములు, చుక్కల భూములను రైతుల నుంచి అగ్రిమెంట్ల మీద కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేద్దామనుకున్న దళారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లు అయ్యింది. రెవెన్యూ అధికారులు రీ వెరిఫికేషన్‌కు వెళ్లినపుడు రైతులు తిరిగి అధికారులనే ప్రశ్నిస్తున్నారు. తాము డీకేటీ భూములను ఎవ్వరికీ విక్రయించలేదని, కొంత మంది దళారులు తమ పేరు మీద ఫ్రీహోల్డ్‌కు దరఖాస్తు చేసుకుని వుంటారేమో అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మదనపల్లె మండలంలో బీకేపల్లె, వలసపల్లె, కోళ్లబైలు, మాలేపాడు, వేంపల్లె, సీటీఎం, కొత్తవారిపల్లె రెవెన్యూ గ్రామాల్లో ఇలాంటి విషయాలు బయటకు వస్తున్నాయి. ఈ గ్రామాల్లో నాలుగు లేన్ల జాతీయరహదారి వెళుతుండటం, పట్టణానికి శివారులో వుండటంతో డీకేటీ భూములకు కూడా మంచి డిమాండ్ వచ్చింది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, దళారులు రంగంలోకి దిగారు. డీకేటీ, చుక్కల భూములు రిజిస్ట్రేషన్ జరగవని తెలిసి రైతులనుంచి అగ్రిమెంట్లు రాయించుకుని ఈ భూములు కొనుగోలు చేశారు. తీరా వీటిని ఫ్రీహోల్డ్ జాబితాలోకి ఎక్కిం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ భూములను రీ వెరిఫికేషన్ చేయిస్తుండటంతో కొంత మంది రైతులు రియల్‌ఎస్టేట్ వ్యాపారులపై తిరగబడుతున్నారు. తాము భూములు ఎవరికి అమ్మ లేదని తెగేసి చెబుతున్నారు. పోనీ రైతులు రాయించిన అగ్రిమెంట్లు బయటపెడదామంటే ..అది చట్టరీత్యా నేరం. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తాము పెట్టిన డబ్బులు వెనక్కి వస్తాయో లేదో అంటూ.. కక్కలేక, మింగ లేక అవస్థలు పడుతున్నారు.



మదనపల్లె మండలం మాలేపాడు గ్రామంలో రీవెరిఫికేషన్ పరిశీలిస్తున్న తహసీల్దార్ ఖాజాబీ

సంతకాలు ఫోర్జరీ అయ్యాయని..

మదనపల్లె మండలంలో పనిచేసిన ఇద్దరు తహసీల్దార్లు ఫ్రీహోల్డ్ దరఖాస్తు విచారణ నివే దికలో తమ సంతకాలను ఎవరో ఫోర్జరీ చేశారని.. అప్పట్లో మదనపల్లెలో విచారణకు వచ్చిన రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాకు రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ ఇచ్చారు. తాము ఫీల్డ్ వెరిఫికేషన్ చేయనే లేదని, అసలు తమ సంతకాలను ఎవరో ఫోర్జరీ చేసి ఆర్డీవో కార్యాలయానికి ఫైళ్లు తీసుకెళ్లారని ఆరోపించారు. దీంతో విచారణ అధికారులకు తహసీల్దార్ సంతకాల ఫోర్జరీ వ్యవహారం మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. ముఖ్యంగా మదనపల్లె మండలంలో ఇప్పటి దాకా నిర్వహించిన రీవెరిఫికేషన్‌లో 1,765 సర్వేనెంబర్లకు గాను 1,946 ఎకరాలు రీవెరిఫికేషన్ పూర్తి చేసినట్లు సమాచారం. ఇందులో 49 సర్వే నెంబర్లలో 37 ఎకరాలు జీవో నెంబర్ 596 నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేశారని సమాచారం. బి.కొత్తకోట మండలంలో 1828 సర్వేనెంబర్లలో 1769 ఎకరాలను రీవెరిఫికేషన్‌లో రెవెన్యూ అధికారులు రిజెక్ట్ చేశారని తెలిసింది. పీటీఎంలో 1970 సర్వేనెంబర్లను రీవెరిఫికేషన్ చేయగా.. 1,632 ఎకరాల భూమిని రిజెక్ట్ చేశారు. రామసముద్రం మండలంలో 424 సర్వేనెంబర్లలో 50 ఎకరాలు రిజెక్ట్ చేశారు. తంబళ్లపల్లె మండలంలో 1,360 సర్వేనెంబర్లను రీవెరిఫికేషన్ చేయగా... 324 సర్వేనెంబర్లలోని భూములను రిజెక్ట్ చేశారు. పెద్దమండ్యంలో కూడా 1,500 ఎకరాలను అధికారులు రిజెక్ట్ చేశారు. వీటిని బట్టి చూస్తే చాలా చోట్ల కింది స్థాయి నుంచి మండలస్థాయి వరకు కొంత మంది రెవెన్యూ అధికారులు అందిన కాడికి డబ్బులు తీసుకుని ఫ్రీహోల్డ్ జాబితాలోకి భూములు ఎక్కించేశారని ఆరోపణలు వున్నాయి. మరికొన్ని చోట్ల వైసీపీ నాయకుల ఒత్తిడితో రెవిన్యూ అధికారులు గత్యంతరం లేక తప్పుల తడకగా ఫ్రీహోల్డ్ జాబితాలోకి 22-ఏ భూములను ఎక్కించినట్లు రీవెరిఫికేషన్ ఫలితాల్లో తేటతెల్లమవుతోంది.

ఆచితూచి అడుగులు వేస్తున్న రెవెన్యూ అధికారులు

గతంలో ఆర్ఓఆర్ 1 రిజిస్టర్, నెంబర్-4 రిజిస్టర్‌లను పరిశీలించి డీకేటీ, చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించిన రెవెన్యూ అధికారులు, ఇప్పుడు రీవెరిఫికేషన్ ప్రక్రియలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఫ్రీహోల్డ్ జాబితాలో అక్రమాలను దిద్దుబాటు చేసుకో వాలని ప్రభుత్వం ఒక ఛాన్స్ ఇవ్వడంతో వీఆర్వో, గ్రామ సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అవసరమైన చోట్ల డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, కొన్ని చోట్ల ఏకంగా తహసీల్దార్లే ఫీల్డ్ విజిట్ చేస్తూ రీవెరిఫికేషన్ చేస్తున్నారు. దీంతో అధికారులందరూ తప్పులు లేకుండా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. దీంతో ప్రతి మండలంలో వందల సంఖ్యలో 22-ఏ దరఖాస్తులు రిజెక్ట్ అవుతున్నాయి. కొన్ని మండలాల్లో 50 శాతం రీవెరిఫికేషన్ పూర్తి కాగా, చాలా వాటిలో 30శాతం మాత్రమే రీవెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి అయ్యింది. ఇంకా రెండు వారాలు సమయం వుండటంతో తప్పులు లేకుండా ఈ ప్రక్రియ ముగించి ఉన్నతాధికారులకు నివేది కలు పంపడంలో తహసీల్దార్లు నిమగ్నమయ్యారు.

ఎంత కష్టమొచ్చిందే.. తల్లీ

● కన్న బిడ్డలతో సహా.. మహిళ ఆత్మహత్య ● గ్యాస్ లీక్ చేసి..నిప్పంటించుకుని ● మాడి మసైన పసిపిల్లలు

● భర్త వేధింపులు తాళలేక భార్య, పిల్లలు ఆత్మహత్య



గ్యాస్ ప్రమాదంలో సజీవ దహనమైన తల్లిబిడ్డలు

ఈ లోకంలో అమ్మను మించిన త్యాగమూర్తి మరొకరు ఉండరేమో... ఈ సృష్టిలో అమ్మ మాత్రమే భరించలేని నొప్పి.. బాధను ఓర్చుకుని.. తన ప్రాణాలను సైతం ఆ చావుకు ఎదురొడ్డి బిడ్డలకు జన్మనిస్తుంది. అలా రెండుసార్లు ఆ బాధ, నొప్పిని తట్టుకున్న ఈ తల్లికి.. భరించలేనంత.. బ్రతకలే నంత.. కష్టం భర్త రూపంలో ఏమొచ్చిందో.. తన పేగు తెంచుకుని.. తన రక్తాన్ని పంచుకుని.. తన ప్రతిరూపాలై.. కళ్లముందే.. భవిష్యత్తు ఆశాకిరణా లై ఎదుగుతున్న ఆ బిడ్డలను.. తనతో పాటు తిరిగిరాని లోకాలకు తీసుకెళ్లిపోయింది. బిడ్డకు నీళ్లు పోసేటప్పుడు.. ఎక్కడ ఉడుకునీళ్లు పడి ఒళ్లు కాలుతుందో.. అని ఒకటికి పది సార్లు నీళ్లలో చేయి పెట్టి చూసే ఆ తల్లికి.. మొగుడితో.. ఎంత కష్టమొచ్చిందో.. చేతులారా బిడ్డల ప్రాణాలు తీసేంత గా.. తన గుండెను బండ రాయిగా చేసుకుంది.. గాఢ నిద్రలో ఉన్న ఆ పసిమొగ్గలపై నిప్పు పెట్టింది. ఆ మంటల్లోనే.. తాను కాలిపోయింది.. తాను కాలిపోతూ... ఆ మంటల్లోనే.. తన కన్న పేగులను తీసుకె ళుతూ.. ఈ కష్టాన్ని.. తన పుట్టినింటికి తెలియజేసింది.. ఏం కష్టమొచ్చిందే.. తల్లీ.. ఎంత ఘోరం చేశావు.. అంటూ అందరూ రోధించిన ఈ దారుణమైన సంఘటన శనివారం ఉదయం 6.30 గంటల సమయంలో రాయచోటి పట్టణంలో జరిగింది. రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణం కొత్తపేట తొగటవీధిలో లక్కిరెడ్డిపల్లె బి.హరిజన వాడకు చెందిన రాజా, గాలివీడు దక్షిణ గడ్డ హరిజనవాడకు చెందిన రమాదేవి దంపతులు జీవి స్తున్నారు. పది సంవత్సరాల క్రితం వీళ్లకు పెళ్లి అయింది. వీళ్లకు కొడుకు ప్రభువ మనోహ (8), కూతరు మన్విత (6) ఉన్నారు. . గత ఐదు సంవత్సరాలుగా రాయచోటి పట్టణంలో నివాసం ఉంటున్నారు. బతుకుదెరువు కోసం రాజా రాయచోటి పట్టణంలో టైలర్ షాపు పెట్టుకుని కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబ భారం పెరగడంతో భార్యభర్తలు ఇద్దరూ కువైత్‌కు వెళ్లారు. పిల్లల పోషణ రాజా తల్లి చూసుకునేది. ఆమెకు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో పిల్లల ఆలనా పాలన కష్టతరమైంది. దీంతో కువైట్ నుంచి ఇద్దరూ వచ్చారు.. పిల్లల దగ్గర భార్యను వదిలి, సంవత్సరం కిందట రాజా తిరిగి కువైత్‌కు వెళ్లాడు. ఇక్కడే రాజా మనసులో అనుమానపు పురుగు తొలిచి.. కుటుంబంలో సమస్యలు మొదలైనట్లు రమాదేవి సోదరుడు నారాయణ తెలిపారు. కువైత్‌కు వెళ్తున్న రాజా ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా రమాదేవికి రాజా వేధింపులు ఎక్కువయ్యాయి. ఈ విషయాన్ని మృతురాలు రమాదేవి తన పుట్టింటి వారికి చెప్పేది. ఈ క్రమంలో ఏమైందో.. ఏమో శనివారం ఉదయం 6గంటల 5 నిమిషాలకు, తాను భర్త వేధింపులు భరించలే కున్నా.. మిమ్మల్ని వదిలి పోతున్నా.. అంటూ రమాదేవి తన అన్న నారాయణకు వాయిస్ మెసేజ్ పంపింది. ఆయన వెంటనే స్పందించి తెలిసిన వారికి ఫోన్ చేసి మా చెల్లెలు ఇలా మెసేజ్ పెట్టింది.. వెళ్లి చూడమని చెప్పాడు. వాళ్లు వచ్చి చూడగా... రమాదేవి ఇంటిలోని బెడ్‌రూమ్‌లో గ్యాస్ సిలిండర్ లీకేచేసి బిడ్డల తో సహా ప్రాణాలు తీసుకుంది. ఈ దుర్ఘటనలో తల్లి, బిడ్డలు సజీవ దహనం అయ్యారు. వంట గదిలోని గ్యాస్ సిలిండర్‌ను బెడ్‌రూం లోకి తెచ్చి.. గ్యాస్ లీక్ చేసి మంట పెట్టుకు న్నట్లు తెలిసింది. ఆ సమయంలో బెడ్ మీద ఒకరినొకరు అనుకుని ఉన్న అన్నా.. చెల్లెల్లు.. అలాగే మృత్యుఒడికి చేరిపోయారు. చుట్టుపక్కల వారి ద్వారా విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.



తల్లిబిడ్డల ఆత్మహత్యలపై ఆరాతీస్తున్న అర్బన్ సీఐ చంద్రశేఖర్

ప్రమాద సంఘటన గురించి తెలుసుకున్న రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేరుకుని సంఘటనపై ఆరాతీశారు. బాధితులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు, అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ నరసింహారెడ్డి, సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వచ్చారు. సంఘటనపై చుట్టుపక్కల వారిని విచారించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం కోసం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలు నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయచోటి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జరిగిన సంఘటన అంతా.. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయినట్లు తెలిసింది. ఈ సీసీ పుటేజి ఆధారంగా పోలీసులు విచారణ చేయనున్నట్లు తెలిసింది.



తల్లిబిడ్డల ఆత్మహత్యలపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గ్రామసింహం - భయానకం



వీధుల్లో శునకాల స్వైర విహారం ● కొత్తవారు రావాలన్నా జంకుతున్న వైనం
నియంత్రణలో అధికారులు విఫలం ● ఇదీ జిల్లా కేంద్రం దైన్యం



ఎక్కడ చూసినా కుక్కల బెడద తీవ్రంగా పెరిగిపోతోంది. ఇటీవల కుక్కల దాడులతో అనేక మంది పిల్లలు, పెద్దలు తీవ్రగాయాలపాలైన సందర్భాలూ ఉన్నాయి. వాహనదారులు ప్రమాదాలకు గురైన సమయాలు అనేకం. గతంలో కుక్కల సంతతి ఎక్కువైతే పట్టుకుని చంపేసే వారు. అయితే సమాజంలో ఏ జంతువు, వన్యప్రాణి ప్రాణం తీసే అధికారం ఎవరికీ లేదని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పల్లెలు, పట్టణాలు అనే తేడాలేకుండా కుక్కల సంతతి పెరిగిపోయింది. ఫలితంగా జనాలపై వాటిదాడులు మరీ ఎక్కువయ్యాయి. పలుసందర్భాల్లో పిల్లలు పెద్దల ప్రాణాలకే ప్రమాదం పొంచి వున్న పరిస్థితులు దాపురించాయి. తల్లిదండ్రులు ధైర్యంగా పిల్లలను రోడ్లమీదికి పంపలేని పరిస్థితి నెలకొంది. అయితే కుక్కల సంతతి నియంత్రణ కోసం ప్రభుత్వం శస్త్రచికిత్స చేయడం మొదలు పెట్టింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రం, కడప మున్సిపల్ కార్పొరేషన్ కంటే చిన్న స్థాయి కలిగిన ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో కుక్కల బెడదను అరికట్టేందుకు అధికారులు కుక్కల సంతతిని నియంత్రణ చేపట్టేందుకు శస్త్రచికిత్స చేయడం ప్రారంభించారు. మరి కడపలో ఆదాఖలాలు ఎక్కడా కన్పించలేదనే చెప్పవచ్చు. రాత్రిళ్లు ఎవరైనా కొత్తవారు రావాలన్నా, ఏదైనా పనులకు వెళ్లి ఆలస్యంగా ఇంటికి వచ్చే వారికి కుక్కల ఇబ్బందులు తప్పడంలేదు. అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలిమరి.

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 17: ఒకటి, రెండు కాదు.. కనీసం పదికి తక్కువ కాకుండా శునకాలు వీధుల్లో స్వైర విహారం చేస్తున్నాయి. వాహన చోదకులపై దాడులు చేస్తూ గాయప రుస్తున్నాయి. చిన్నపిల్లలపై కూడా దాడులు చేస్తున్నాయి. కడప నగరంలో లెక్కకు మించి వీధుల్లో సంచరిస్తూ బాటసారులను భయపెడుతున్నాయి. కుక్కలను చూస్తే తప్పించుకుని తిరగా ల్సిన పరిస్థితి నగరవాసులకు ఏర్పడింది. ఇటీవల కడప శివారు ప్రాంతం రామరా జుపల్లెలో ఒక చిన్నారికి కుక్క దాడి చేసి కరవడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దాన్ని నగర ప్రజలు చూసి భయ భ్రాంతులకు గురయ్యారు. కుక్కలను పట్టిం చాలని డిమాండ్ చేస్తున్నారు.

నియంత్రణ లేకపోవడమే అసలు సమస్య



జ్యోతి కెమికల్స్ వద్దగల టిడ్కో ఇళ్లలో...

కడప నగరం కార్పొరేషన్ పరిధిలో కుక్కల నియంత్రణ చర్యలు అటకెక్క డంతో వీటి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గతంలో కుటుంబ నియంత్రణ చర్యలు చేపట్టాలని అధి కారులు ప్రయత్నించినా అది కార్యరూ పం దాల్చలేదు. సంతానోత్పత్తి తగ్గిం చే చర్యలు చేపట్టలేదు. నగరంలో

నాలుగువేల కుక్కలకు సర్జరీ చేశాం

కడప కార్పొరేషన్ పరిధిలో నాలుగువేల కుక్కలకు స్టెరిలై జేషన్ చేశాం. రోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ కుక్కలను పునరావాస కేంద్రాలకు చేరుస్తున్నాం. త్వరలో కడప కార్పొరేషన్ పరిధిలో కుక్కలను పూర్తిగా నియంత్రించేం దుకు చర్యలు తీసుకుంటున్నాం.
- ఎం హెచ్‌ఓ చంద్రశేఖర్, కడప కార్పొరేషన్



వీధుల్లోనూ కుక్కల స్వైరవిహారం

వేల సంఖ్యలో కుక్కలున్నాయని అధికారు ల అంచనా. నిత్యం ఏదోక చోట కుక్కల దాడితో కార్పొరేషన్ ప్రజలు గాయాలపాల వుతున్నారని సమాచారం.

ప్రమాదాలకు కారణం

కడప నగర ప్రాంతం సహా శివారు ప్రాం తాల్లో కూడా కుక్కల బెడద ఎక్కువైంది. రాత్రీపగలు తేడా లేకుండా ద్విచక్ర వాహ న చోదకులు, బాటసారులకు ఇవి కనిపిం చక ప్ర మాదాల బారిన పడుతున్నారు. రాత్రిళ్లు గుంపులు గుంపులుగా కుక్కలు వీధుల్లో తిరుగుతూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. రాత్రివేళ బయట ఉన్న వాహ నాల సీట్లు కూడా పాడు చేస్తున్నాయి. వాహన చోదకులపై దాడి చేస్తున్నాయి. కుక్కల అరుపులు, ఏడుపులతో రాత్రుళ్ల నిద్ర లేక నగర ప్రజలు అల్లాడుతున్నారు.

సీఐని అభినందించిన ఎస్పీ విద్యాసాగర్



సీఐ సాధిక్‌అలీని అభినందిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు17: పోలీసుశాఖలో విశిష్ట సేవలందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ద్వారా ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్న రెడ్ శాండల్ టాస్క్‌ఫోర్స్ సీఐ సాధిక్ అలీని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మెడల్ గ్రహీత సాధిక్ అలీ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదే స్పూర్తితో మున్ముందు విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సాధిక్‌అలీ ఎన్నో సంచలనాత్మక కేసులను ఛేదించారన్నారు. చిత్తూరు జిల్లా సత్యవేడు వద్ద సెల్‌ఫోన్ కంటైనర్‌ను అపహరించిన కేసులో దొంగల ముఠాను దేశంలోనే తొలిసారి అరెస్టు చేసి ఘనత సాధించారన్నారు. 2014 నుంచి 2018 మధ్య 500 టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకోవడమే కాక అంతర్జాతీయ, జాతీయ ఎర్రచందనం స్మగ్లర్లను కటకటాల వెనక్కు పంపారన్నారు. 2003లో ఎస్ఐగా ఉద్యోగ ప్రస్తానాన్ని ప్రారంభించిన సాధిక్ అలీ ఇప్పటి వరకు 150కిపైగా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారన్నారు.

విద్యుత్ విజిలెన్స్ మెరుపుదాడులు

● 18 మందిపై కేసులు నమోదు - రూ.2 లక్షలు జరిమానా



ఇంటి మీటరును తనిఖీ చేస్తున్న విజిలెన్స్

రాయచోటిటౌన్, ఆగస్టు17: విద్యుత్ డీపీఓ ఎస్ఈ శ్రీనివాస బాబు ఆదేశాల మేరకు విజిలెన్స్ డీఈ రమేశ్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న పలు ఇండ్లల్లో విజిలెన్స్ దాడులు చేపట్టింది. శనివారం నిర్వహించిన దాడుల్లో విద్యుత్ చౌర్యానికి, అక్రమ విద్యుత్ వాడుతున్న 18 మందిని గుర్తించి వారికి రూ.2 లక్షల జరిమానా విధించారు. విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏడీఈ మధులత, ప్రవీణ్‌కుమార్, ఏఈలు నాగరాజు, రామాంజనేయులు, రవి, నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పేలిన ఐపీ బాంబు - ఆందోళనలో రైతులు

పెద్దముడియం, ఆగస్టు 17: పెద్దపసుపుల శివార్లలోని శ్రీ గణేశ్ రైతు మిత్ర రూరల్ వేర్‌హౌస్ గోదాముకు నలుగురు యజమానుల్లో ఒకరు ఐపీ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఆ గోడౌన్‌లో సరుకు నిల్వ చేసిన రైతుల్లో ఆందోళన రేకెత్తించింది సమాచారం తెలుసుకున్న రైతులు గోడౌన్‌లో నిల్వ ఉంచిన తమ సరుకు ఉందో లేదోనన్న అతృతతో శనివారం పెద్దఎత్తున గోడౌన్‌కు చేరుకున్నారు. ఈ సమాచారం పోలీసులకు తెలియడంతో జమ్మలమడుగు రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి గోడౌన్ వద్దకు చేరుకుని బందోబస్తు నిర్వహించారు. గోడౌన్‌లో సరుకు నిల్వ ఉంచిన రైతులు తమ సరుకులు ఉందో లేదో చూపించాలని పట్టుబట్టడంతో గోడౌన్ తలుపులు తెరిచి శెనగలు, ధనియాలు, జొన్నల బస్తాలను అన్నీ చూపించారు. దీంతో గోడౌన్ వద్దకు వచ్చిన రైతులు వారి సరుకు సురక్షితంగా ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఐపీ దాఖలు చేసిన వ్యక్తి జమ్మలమడుగు పట్టణం ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తుల వద్ద అప్పు చేసి ఐపీ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం.

నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

10 దుంగలు స్వాధీనం



దుంగలు, నిందితులతో అటవీ డివిజనల్ ఫారెస్టు ఆఫీసరు గురు ప్రసాద్

కడప (క్రైం), ఆగస్టు 17: కడప అటవీ డివిజన్ పరిధి లంకమల రిజర్వు అడవి ఖాజీపేట సెక్షన్, బయనపల్లె బీట్, కొండపేట తెలుగుగంగ కెనాల్ వద్ద ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు డివిజనల్ ఫారెస్టు ఆఫీసరు గురు ప్రసాద్ తెలిపారు. ఆయన వివరాలు మేరకు నాగపట్నం వాసి పత్తూరు నాగభూషణం, కె.సుంకేసులపల్లెకు చెందిన గోకన్న శ్రీనివాసులరెడ్డి, వేంపల్లె కాపు వీధికి చెందిన దుంపల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కుప్పాలపల్లెకి చెందిన కుడుమల శ్రీనివాసరెడ్డి స్మగ్లర్లు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో వారిసపై దాడులు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. 10 ఎర్రచందనం దుంగలను అక్రమరవాణా చేస్తున్న కారు, పైలట్ చేస్తున్న రెండు మోటరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పారిపోయిన అద్దంకి నిఖిల్‌కుమార్ ఆచూకీ కోసం స్క్వాడ్ పార్టీలు గాలిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అటవీ క్షేత్ర అధికారి నయీం అలీ, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు నాగరాజు, ఖాజారహ్మతుల్లా, రవిచంద్ర, బీట్‌ఆఫీసర్లు శోభారాణి, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్టు

3 కిలోల గంజాయి, సెల్, రూ.6500 నగదు స్వాధీనం



గంజాయి, వివరాలు వెల్లడిస్తున్న సీఐ సీతారామిరెడ్డి

కడప (క్రైం), ఆగస్టు 17: కడప - తాడిపత్రి బైపాస్ రోడ్డులోని చలమారెడ్డిపల్లె క్రాస్ వద్ద శనివారం గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఇన్‌చార్జ్ సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. కడప భాగ్యనగర్ కాలనీ వాసి మహేశ్, కడప పాత బైపాస్‌లోని వై.జంక్షన్‌కు చెందిన నిమ్మకాయల టైటాన్స్ మనోహర్ చలమారెడ్డిపల్లె క్రాస్ వద్ద గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం. ఎస్పీ ఆదేశాల మేరకు కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ సుధాకర్ సూచనల మేరకు డిస్ట్రిక్ట్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్, చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి మూడు కిలోల గంజాయి, సెల్‌ఫోను, రూ.6500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులను రిమాండుకు పంపినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

వడదెబ్బతో మహిళ మృతి

నందలూరు, ఆగస్టు 17: వడదెబ్బతో మతిస్థిమితం లేని మహిళ పొన్నాల వెంకటసుబ్బమ్మ(50) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. రాజంపేట మండలం మన్నూరు వాసి వెంకటసుబ్బమ్మ మతిస్థిమితం లేక ఆలయాల వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవించేది. చెన్నై - కడప జాతీయ రహదారి పక్కన నందలూరులో మూసివేసిన ఆల్విన్ కర్మాగార సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వడదెబ్బతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఎస్ఐ అబ్దుల్‌జహీర్ ఆమెకు ఎవరూలేరని తెలియడంతో మృతదేహానికి పంచాయతీ సిబ్బందితో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

అప్పుల బాధతో రైతు తిరుపాల్‌రెడ్డి ఆత్మహత్య



సింహాద్రిపురం, ఆగస్టు 17: అంకాళమ్మ గూడూరు రైతు కటికిరెడ్డి తిరుపాల్ రెడ్డి(35) అప్పుల బాధతో తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. సింహాద్రిపురం ఎస్ఐ తులసినాగప్రసాద్ సమాచారం మేరకు తిరుపాల్ రెడ్డి తనకున్న రెండున్నర ఎకరాల చీనీ తోట సాగు చేసుకుని జీవనం సాగించేవాడు. ఇటీవల వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పు చేశాడు. దీంతో వడ్డీలు పెరిగి చెల్లించలేక తలకు మించిన భారంగా మారింది. మృతుడు తిరుపాల్‌రెడ్డికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబీకులు శోక సముద్రంలో మునిగా రు. మృతుని భార్య కటికిరెడ్డి మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తులసినాగప్రసాద్ తెలిపారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా

కోరం లేకపోవడమే కారణం ● యథావిధిగా కొనసాగించాలన్న ఎన్నికైన సభ్యులు
టెన్త్‌కు మాత్రమే జరపాలన్న సభ్యులు ● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా : హెచ్‌ఎం



హెచ్‌ఎంకు ఫిర్యాదు చేస్తున్న కొత్తగా ఎంపికైన సభ్యులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 17: కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు వాయిదా పడ్డాయి. శనివారం కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. కోరం లేని కారణంగా ఎన్నికలను ప్రధానోపాధ్యాయురాలు నాగమణి వాయిదా వేసినట్లు ప్రకటించారు. మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో ఈ నెల 8న ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ సహా సభ్యులను కూడా ఎన్నుకున్నారు. ఎస్‌ఎంసీ నిబంధనల ప్రకారం లక్షా 44 వేల రూపాయల పైన ఆదాయం ఉన్న వారు సభ్యులుగా ఉండకూడదు. అయితే పదో తరగతిలో ఒక సభ్యుడు నిబంధనలకు విరుద్ధంగా ఎంపికయ్యారు. కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు సిబ్బంది రవిని సభ్యుడిగా ఎంపిక చేయడంపై కొందరు కడప ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె ఈ ఎన్నిక చెల్లదని మళ్లీ నిర్వహించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఉన్నతాధికారులు ఎన్నికలను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో శనివారం ఎస్‌ఎంసీ ఎన్నికలను మున్సిపల్ హైస్కూలులో మెయిన్‌లో నిర్వహించాలి. కాగా 6 నుంచి 10వతరగతి వరకు 1338 మంది ఓటర్లలో 50 శాతం అంటే 669 మంది హాజరైతేనే ఎన్నికలు నిర్వహించాలి. శనివారం కేవలం 301 మంది హాజరయ్యారు. కోరం లేని కారణంగా ఎన్నికలు వాయిదా వేశారు.

తమను యథావిధిగా కొనసాగించాలి : కొత్త సభ్యులు

6వతరగతి నుంచి 9వతరగతి వరకు జరిగిన సభ్యుల ఎంపిక ప్రక్రియ సజావుగా జరిగింది. పదో తరగతి సభ్యుల ఎంపికలో మాత్రమే నిబంధనలకు విరుద్ధంగా జరిగింది. అయితే తమను యదావిధిగా కొనసాగిస్తూ పదోతరగతికి మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని కొత్తగా ఎంపికైన సభ్యులు డిమాండ్ చేశారు. హెచ్‌ఎం నాగమణి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. 6 నుంచి 9 తరగతుల్లో ఎటువంటి అవకతవకలు జరగలేదని, తమను కొనసాగించాలని పదోతరగతి మాత్రమే ఎన్నికలు జరపాలని కోరారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా : హెచ్‌ఎం

అధికారులు ఇచ్చిన సూచనల మేరకు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రధానోపాధ్యాయురాలు నాగమణి స్పష్టం చేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ కోరం లేని కారణంగా ఎన్నికలు వాయిదా వేశామని, ఉన్నతాధికారుల ఆదేశాలపై త్వరలో ఎన్నికల తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

సబ్ రిజిస్ట్రార్ శ్యామలాదేవి సస్పెన్షన్

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 17: కడప సబ్ రిజిస్ట్రార్ కె.శ్యామలాదేవిని సస్పెండ్ చేస్తూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ పీజీఎస్ కళ్యాణి శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. కొన్ని ఆరోపణల మేరకు శ్యామలాదేవిని కర్నూలు రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ చేశారు. అయితే ఆమె ఇంత వరకూ బదిలీ అయిన స్థానంలో విధుల్లో చేరలేదు. విధుల పట్ల నిర్లక్ష్యం కారణంగా ఆమెను సస్పెండ్ చేసినట్లు ఈ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి



సింహాద్రిపురం, ఆగస్టు 17: దుద్దేకుంట్ల గ్రామంలో విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ మెయిన్ లైన్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ తీగలు గేదెలకు తగలడంతో అక్కడికక్కడే గేదెలు మృతి చెందాయి. విశ్వనాథ్, గంగనబయుడు, వి. వెంకటరమణ, సంజీవికి చెందిన పశువులుగా గుర్తించారు. వర్షం నీళ్లు నిల్వ వుండడంతో మరమ్మత్తులకు వీలుకాక విద్యుత్ సరఫరా నిపేసినట్లు ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధితులు కోరారు.

నిందితులకు శిక్ష పడేలా కృషిచేయాలి

కోర్టు మానిటరింగ్ సిబ్బందికి దిశానిర్దేశం చేసిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



కోర్టు మానిటరింగ్ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప (క్రైం), ఆగస్టు 17: సకాలంలో సాక్షులను కోర్టులో హాజరు పరిచి బాధితులకు న్యాయం జరిగేలా నేర నిరూపణ చేసి నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కోర్టు మానిటరింగ్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. శనివారం పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పోలీసు స్టేషన్లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్షించిన ఎస్పీ మాట్లాడుతూ కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. అన్ని ట్రయల్ కేసుల్లో సత్వర, సక్రమ విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కోర్టు ద్వారా సంబంధిత కేసుల్లో సీసీ నెంబర్లను తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త చట్టం మేరకు కోర్టు ప్రొసీడింగ్స్ జరిగేలా చూడాలని ఎస్పీ ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, కోర్టుమానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ వినయకుమార్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు డి.భాస్కర్‌రెడ్డి, సయ్యద్ హసం పాల్గొన్నారు.

బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

ఉత్తర్వు నెంబర్ 75 జారీ ● ఆగస్టు 19 నుండి 31 వరకు అనుమతి
ఐదేళ్లు పూర్తి అయిన వారు తప్పనిసరి బదిలీ ● ఆగస్టు 25 లోపు దరఖాస్తు దాఖలు

కడప(రూరల్) ఆగస్టు 17: 2024 జూన్ 6న వెలువడిన సార్వత్రిక ఫలితాల్లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించి అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలకు ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శనివారం ఉత్తర్వు నెంబర్ 75 ఫైనాన్స్ అండ్ ప్లానింగ్‌ను ప్రభుత్వం జారీచేసి ఆగస్టు 19 నుంచి 31 లోపు సాధారణ బదిలీలకు అనుమతించింది. ప్రస్తుతం పనిచేస్తున్న కార్యాలయంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి అయిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని పేర్కొంది. ఏవేని రిక్వెస్టు, అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద బదిలీ కోరేవారు కూడా బదిలీకి ధరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. క్రమశిక్షణా చర్యలు కానీ, శాఖాపరచర్యలు కానీ ఉన్నట్లైతే బదిలీకి అనర్హులుగా పేర్కొంది. సాధారణ బదిలీలపై నిషేధం సెప్టెంబర్ 1 నుంచి అమలులోకి వస్తుందని తెలిపింది. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలోని జడ్పీ, డీపీఓ, పీఆర్, డ్వామా, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలో బదిలీల పక్రియను ఆయా జిల్లా అధికారులు చేపట్టనున్నారు. జిల్లా ప్రజాపరిషత్‌శాఖ సాధారణ బదిలీకి అర్హులైన ఎంపీడీఓలు, మినిస్టీరియల్, నాల్గవ తరగతి సిబ్బంది ఐదేళ్లు పూర్తి అయిన వారు, రిక్వెస్టు బదిలీకి సంబంధిత అధికారుల అనుమతితో ఆగస్టు 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కడప జడ్పీ కార్యాలయానికి ధరఖాస్తు చేసుకోవచ్చని జడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏవేని రిక్వెస్టు, అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద బదిలీ కోరేవారు కూడా బదిలీకి ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.


రాయచోటి: నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు


చిట్వేలి: కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైద్యులు, అంగన్వాడీ హెల్పర్లు


రైల్వే కోడూరులో..


రాజంపేటలో..

హత్యాచారం నిందితులను ఉరి తీయాలి

● నినదించిన వైద్య సిబ్బంది, మహిళా, ప్రజా సంఘాలు

రాయచోటిటౌన్, ఆగస్టు 17: వైద్య విద్యార్థిని హత్య కేసు నిందితులను తక్షణమే ఉరి తీయాలని వైద్యులు బయారెడ్డి, లక్ష్మీప్రసాద్, మహేశ్వర్‌రాజు, భాస్కర్‌రెడ్డి, హరిణి తదితరుల ఆధ్వర్యంలో ప్రైవేటు , ప్రభుత్వ వైద్యులు డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ శనివారం రాయచోటి ఏరియా ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూడా అత్యాచారాలకు పాల్పడుతున్న కొందరు పెద్ద పెద్ద నాయకుల అండదండలతో నిందితులు బయటకు వచ్చి దర్జాగా తిరుగుతున్నారు. కానీ వాళ్ల చేతుల్లో బలైపోతున్న విద్యార్థులకు, మహిళలకు మాత్రం న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచారానికి పాల్పడిన వారికి ఎంత పెద్ద అండదండలు ఉన్న పోలీసులు వాటిని లెక్కచేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. అలాగే వైద్య విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు కోరారు.

సుండుపల్లె: కోల్‌కత్తాలోని ఆర్జీకర్ వైద్యశాల ఆసుపత్రిలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారం చేసిన మృగాలను కఠినంగా శిక్షించాలంటూ అన్ని పార్టీల నాయకులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది మండల కేంద్రంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. బస్టాండు వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. బీజేపీ రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వామి, తెలుగు దేశం నాయకులు శివరాంనాయుడు, సురేశ్ నాయుడు, మండల బీజేపీ అధ్యక్షుడు నాగరాజు, శివశంకర్, సుబ్బ రాజు, మునయ్య, సుబ్బరాము, జనసేన పార్టీ వీర మహిళ రెడ్డిరాణి, సంఘ సేవకుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్, డాక్టర్లు, అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు ధనుంజయరెడ్డి, ఫార్మసిస్ట్ శివకుమార్, ప్రజా సంఘాల

చిట్వేలి: మహిళలకు రక్షణ కల్పించడం సామాజిక బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి అన్నారు. శనివారం స్థానిక కొత్త బస్టాండులో కొవ్వొత్తుల ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. మ ధ్యాహ్నం భోజన విరామ సమయంలో వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు కొవ్వొత్తుల ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. వైద్యాధికారులు సల్మా, జయప్రకాష్, అన్సారి, హెల్త్ అసిస్టెంట్‌లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఐసీడీఎస్ గ్రేడ్-1 సూపర్‌వైజర్‌లు విశాలాక్షి, సురేఖారాణి, హరీష్, అంగన్వాడీ వర్కర్‌లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: అత్యాచారానికి పాల్పడిన వ్యక్తులకు ఉరిశిక్ష విధించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

రైల్వేకోడూరు: రైల్వేకోడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ఓపీ విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యురాలు బ్రహ్మకుమారి, రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు హరిక్రిష్ణ, సాయి, సిబ్బంది పాల్గొన్నారు. రాత్రి వైద్యులు, సిబ్బంది కలసి కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. దోషులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని ప్రభుత్వ వైద్యులు దేవేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యాధికారిణి రాధామాధవి, వైద్య సిబ్బంది, సీహెచ్‌వోలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం: సిద్దవటం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్యులు ధర్నా చేశారు. ఈసందర్భంగా డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ మహిళా వైద్యులకు రక్షణ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. మాధవరం పీహెచ్‌సీలో డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో ఓపీని ఆపేసి నిరసన తెలిపారు.

నందలూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు శరత్ కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటనారాయణ, నాగమణి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో వైద్యసిబ్బంది మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. వైద్యులు గురుమహేష్, రాజశేఖర్, గీతా, రూపా మాట్లాడుతూ మహిళలకు ఇబ్బందులు కలిగించే దుష్టశక్తులను కట్టడిచేయాల్సిన బాధ్యత సమాజమే తీసుకోవాలని, తద్వారా ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా ఉంటాయని వైద్యసిబ్బంది కోరారు. ఇలాంటి దౌర్భాగ్యం ఎవరికి కలగకుండా చూడాలని, ఇది దేశ పౌరుల బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: మండల కేంద్రంలో ఆర్ఎంపీల యూనియన్ జిల్లా జాయింట్ సెక్రటరీ డాక్టర్ డీవీఎస్ రాజు అధ్యక్షతన నిరసన వ్యక్తం చేశారు. జిల్లా జాయింట్ సెక్రటరి నాగరాజు, మండల అధ్యక్షులు సురేష్‌బాబు, జాయింట్ సెక్రటరీ పవన్‌కుమార్‌రాజు, సీనియర్ డాక్టర్ టి.రామక్రిష్ణయ్య, జి.రామసుబ్బయ్య, బీవీ ప్రకాష్, జి.పెంచలయ్య, చంద్రమోహన్, గంగాధర్, టి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేటలో వైద్యులు వైద్యసేవలు ని లిపివేశారు. ర్యాలీ నిర్వహించారు. సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. డాక్టర్ల సంఘ నాయకులు చలమయ్య, శ్రీహరి, ధనశ్రీ, డాక్టర్ ఎం.బాలరాజు, డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరి మండే అబూబకర్ ఆధ్వర్యంలో రాజంపేటలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు ఎస్‌కే కరీం, అష్రఫ్‌ఖాన్, వాహిద్, షేక్ షాహిద్, బషీర్, మొహిస్సిన్‌ఖాన్, ముబష్షీర్, అలీ, ఆబిద్, న్యామతుల్లా, గౌస్, రజాక్, షామీర్‌బాషా పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వర్తించాలి


రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వైఖోం నిధియాదేవి

ఓబులవారిపల్లె, ఆగస్టు 17 : మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయాన్ని శనివారం రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోం నిధియాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ ముల రీ వెరిఫికేషన్ వివరాలను పరిశీలించారు. అన్నిరకాల రికార్డులను సక్రమంగా నిర్వహించుకోవాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. తహసీల్దారు రాయచోటి జిల్లా కేంద్రానికివెళ్లగా రెవెన్యూ సిబ్బంది సంబందిత రికార్డుల వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని శనివారం సబ్‌కలెక్టర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మహిళల కోసం మరుగుదొడ్లు నిర్మించాలని సూచించారు. ఫ్రీ హోల్డ్ భూముల వివరాలను అడిగి తెలుసుకుని తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీ మోహన్, ఆర్ఐ సుశీల్, వీఆర్వోలు, వీఆర్ఏలు సిబ్బంది పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించాలి


మాట్లాడుతున్న జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి షమీవుల్లా

సుండుపల్లె, ఆగస్టు 17: విద్యార్థులకు గుణాత్మక విద్య అందించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని అన్నమయ్య జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి షమీవుల్లా సూచించారు. మండల పరిధిలోని తిమ్మసముద్రం జీకే రాచపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల కాంప్లెక్స్‌లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. తిమ్మసముద్రం ఉన్నత పాఠశాలలో నాడు- నేడు పనులను పరిశీలించారు. బోధనలో మెళకువలు, గుణాత్మక విద్య, శిక్షక సప్త తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-1 వెంకటేశ్‌నాయక్, మండల విద్యాశాఖ అధికారి-2 ఎం. రవీంధర్‌నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీజీకే రామచంద్ర, సుమలత, జయన్న, రీసోర్స్‌పర్సన్లు, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పాఠ్యాంశాల బోధన సులభతరంగా ఉండాలి

పెనగలూరు, ఆగస్టు 17 విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధానంలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించాలని చక్రంపేట స్కూల్ కాంప్లెక్సు కార్యదర్శి చెన్నయ్య సూచించారు. శనివారం జగ్గంపేట ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో చక్రంపేట స్కూల్ కాంప్లెక్సు పరిధిలోని నాయుడువారిపల్లె, కట్టావారిపల్లె, చక్రంపేట పరిధిలోని ప్రాథమిక పాఠశాలల హెడ్ టీచర్లకు 6 సబ్జెక్టులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఆర్పీలు బాదుషా, శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 17: ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదామని వీసీఎస్ఎస్ డైరెక్టర్ గడికోట చెన్నారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం వెంకటేశ్వర జూనియర్ కాలేజీలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .ఎయిడ్స్ బాధితులను ఆదరించాలన్నారు, ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ యువత ఎయిడ్స్‌పై అవగాహన కలిగిఉండాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మేనేజరు స్వాతి మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులకు ప్రతి ఆసుపత్రిలో ఉచితంగా మందులు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎస్ అల్లావలి, సాదులాబాషా, రెడ్డెయ్య, నాగేశ్వర, అధ్యాపకుడు సహదేవరెడ్డి, కల్యాణి, శాంతయ్య, సుందరం, గంగిరెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు

ప్రతి గర్భిణికి పౌష్టికాహారం అందించండి


గర్భిణులకు శ్రీమంతాలు చేస్తున్న సీడీపీవో పద్మావతి

లక్కిరెడ్డిపల్లె ఆగస్టు 17; ప్రతి గర్భిణికి పౌష్టికాహారం అందించాలని సీడీపీవో పద్మావతి ఆదేశించారు. శుక్రవారం రవీంద్రనగర్ అంగన్ వాడీ కేంద్రంలో శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గర్భిణి పేరు నమోదు చేయడంతో పాటు, క్రమం తప్పకుండా టీకాలు వేయాలన్నారు. బాలామృతం, పౌష్టికాహారం అందించాలన్నారు. బేటీ పడావో.. బేటీ బచావో కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు దాదాబీ, తులసమ్మ, హైమావతి, సోని అంగన్‌వాడీ కార్యకర్త రుక్మిణి పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న పంతగాని అభిమానులు

రైల్వేకోడూరు, ఆగస్టు 17: రాష్ట్ర టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా శనివారం సుమారు 1000 మంది పేదలకు అన్నదానం చేశారు. రైల్వేకోడూరులోని ఆయన గృహంలో నిర్వహించిన వేడుకలకు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలి వచ్చి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ యువ నాయకులు యనమల భాస్కర్‌రావు, ముత్యాల కిషోర్, దాసరి వీరేంద్ర, ముద్దుపోలు రామసుబ్బయ్య, నాగోలు అమర్‌నాథ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రాష్ట్ర బీసీ నాయకులు కమతం నాగరాజుయాదవ్, కూటమి యువ నాయకులు కస్తూరి దినేష్‌నాయుడు, రాయుడు, శంకరయ్య, మల్లెం హేమంత్, కుమార్, హరిప్రసాద్, కూటమి నాయకులు సూర్యప్రకాష్‌నాయుడు, బి. మస్తాన్, పి. మస్తాన్, మెహతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

సుండుపల్లె, ఆగస్టు17: ఏపీయూ డబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినో త్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బా లింతలు, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో వైద్యాధికారి హసన్‌అలీ ఏపీ డబ్ల్యూజే గౌరవాధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి పల్లం చందు, మండలాధ్యక్షుడు తిరుపాల్‌నాయక్, ఉపాధ్యక్షుడు యూసుఫ్, సహాయ కార్యదర్శులు వెంకటేశ్, రెడ్డిశేఖర్, కార్యవర్గ సభ్యులు రవీంద్రరాజు, ఆదినారాయణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాజంపేట: ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రాజంపేట జర్నలిస్టులు పాతబస్టాండు కూడలిలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన్నూరు సీఐ రామాంజనేయుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు, జర్నలిస్టు నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

ఓబులవారిపల్లె, ఆగస్టు 17 : అనంతరాజుపేట క్రాస్‌రోడ్డు వద్ద లారీ, ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో మృతిచెందిన మంగంపేట అగ్రహారంవాసులు పుల్లగంటి వెంకటసుబ్బయ్య(45), బత్తల సిద్దేశ్వరం(40)ల కుటుంబ సభ్యులను శనివారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి పరామర్శించారు. రెండు కుటుంబాలకు చెరో లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. వారి కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాతంశెట్టి నాగేంద్ర, జోగినేని మణి, పగడాల వెంకటేశ్, వరికూటి నాగరాజ, పోతురాజు నవీన్, తదితర కూటమి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరాలయంలో అన్నదానం

గాలివీడు, ఆగస్టు 17: మండల కేంద్రంలోని పెద్దూరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో కే. చంద్రమోహన్, ప్రశాంత్, కంచపు రమణ సహకారంతో శనివారం దాదాపు 300కి అన్నదానం చేశారు. శ్రావణమాసం కావడంతో స్వామి వారి దర్శనార్థం ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు ఆనంద్ ఆచార్యులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో టీటీడీ కళాకారులు డాక్టర్ నాగేశ్వరరావు బృందం హరికథ వినిపించింది

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

రామాపురం, ఆగస్టు17: ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇసుక అవసరం ఉన్న వారు సంబంధిత అధికారుల నుంచి పర్మిషన్ పొందాలన్నారు. వాహనదారులు యొక్క పర్మిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎస్ఐ శ్రీనివాస్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నమండెం ఎస్ఐగా సుధాకర్



చిన్నమండెం, ఆగస్టు17: చిన్న మండెం ఎస్ఐగా సుధాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో చిట్వేల్, మదనపల్లె తాలూకా, మన్నూరు, రిమ్స్, చిన్నమండెం పోలీస్‌స్టేషన్లలో పని చేశారు. బదిలీల్లో భాగంగా చిన్నమండెం ఎస్ఐగా ఉన్న రమేశ్‌బాబును జిల్లా హెడ్‌క్వార్టర్ లోని డీపీటీసీకి వెళ్లారు. ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూఅసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా శాంతి భద్రతలను పరిరక్షించడమే ప్రథమ కర్తవ్యం అని తెలిపారు.

మన్నూరు రూరల్ సీఐగా రమణ



రాజంపేట టౌన్, ఆగస్టు 17 : మన్నూరు సీఐగా బీవీ రమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నంద్యాలలో పనిచేస్తూ బదిలీపై మన్నూరు కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ సర్కిల్ పరిధిలోని నందలూరు, పెనగలూరు, పుల్లంపేట మండల కేంద్రాల్లో శాంతి భద్రతలు పరిరక్షణకు అన్నివిధాల చర్యలు తీసుకుంటానని తెలిపారు.

20 నుంచి ఆధార్ అప్‌డేట్ క్యాంపులు

పుల్లంపేట, ఆగస్టు 17 : ఈనెల 20 నుంచి 24 వరకు 4 రోజుల పాటు ఆధార్ అప్‌డేట్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రఘురాం తెలిపారు. 20న రంగంపల్లె, తిప్పాయపల్లె, 21న కొమ్మనవారిపల్లె గ్రామ సచివాలయాలు, బావికాడపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల, 22న పుల్లంపేటలోని ఎస్‌బీవీడీ ఉన్నత పాఠశాల, అనంతసముద్రం గ్రామ సచివాలయం, 23న అప్పయ్యరాజుపేట మండల పరిషత్ ఉన్నత పాఠశాల, అనంతసముద్రం సచివాలయం 24న కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల, వత్తలూరు ప్రాథమిక పాఠశాలలో క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంపులో కొత్తగా ఆధార్‌కార్డులు నమోదు, ఐదేళ్ల దాటిన పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్, ఆధార్‌కార్డు పొంది పదేళ్ల దాటినవారికి బయోమెట్రిక్ అప్‌డేట్, పేరు, చిరునామా, ఫోన్ నంబర్లు అప్‌డేట్ చేస్తారన్నారు.

పిడుగుపాటుతో నెర్రెలు చీలిన ఇల్లు


పిడుగు పడడంతో దెబ్బతిన్న ఇంటి పైగోడ

రాజంపేట, ఆగస్టు 17 : రాజంపేట మండలం బోయనపల్లె ప్రాంతంలో శనివారం సాయంత్రం పిడుగు పడడంతో ఓ ఇల్లు ఇంటిపైభాగం నెర్రెలు చీలింది. సాయంత్రం మూడు గంటల సమయంలో వర్షంతోపాటు ఈదురు గాలులు వీస్తూ పిడుగు పడడంతో బొడిచెర్ల సుబ్బరాయుడు ఇంటిపై గోడలు దెబ్బతిని ఇంటిస్లాబు నెర్రెలు చీలింది. ఎటువంటి నష్టం జరగలేదు. పిడుగు పాటుకు బోయనపల్లె గ్రామస్థులు భయకంపితులయ్యారు.

వైసీపీ నేతల అక్రమాలను అధికారుల దృష్టికి తేవాలి: చమర్తి


టీడీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

సిద్దవటం, ఆగస్టు 17 : రెవెన్యూ సదస్సుల్లో వైసీపీ నేతల భూ అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు కార్యకర్తలకు సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి దశరథ రామనాయుడును పరామర్శించేందుకు శనివారం జంగాలపల్లె పంచాయతీ కమ్మపాళేనికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మండల కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ నేతల భూ అక్రమాలను వెలికితీసి రెవెన్యూ సదస్సుల్లో అధికారులు దృష్టికి తేవాల న్నారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మన సత్తా చాటాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడ్డవారిని అధిష్ఠానం గుర్తించి న్యాయం చేస్తుందని తెలియజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు క్లస్టర్ ఇన్‌చార్జి సమక్షంలో పార్టీ వ్యవహారాలు జరగాలని ఆయన కార్యకర్తలకు తెలిజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఒంటిమిట్ట అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి కాడే శ్రీనివాసులు నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సయ్యద్ జవహర్‌బాషా, సింగిల్ విండో మాజీ డైరెక్టర్లు బాలిరెడ్డి, ఖాజాపీర్, తుర్రా ప్రతాప్‌నాయుడు, ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, ముస్లిం మైనార్టీ అధ్యక్షుబు డాక్టర్ వీరభద్రుడు, శంకర్‌రెడ్డి, పుత్తా విజయ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రాజును కలిసిన ఎస్ఐలు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట సర్కిల్ పరిధిలోని సిద్దవటం, ఒంటిమిట్టలో బాధ్యతలు చేపట్టిన చిరంజీవి, శివప్రసాద్‌లు రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజును హరిత హోటల్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఇరువురు విడివిడిగా శాంతిభద్రతలపై చర్చించారు. సర్కిల్ పరిధిలో నేరాల అదుపునకు కృషి చేయాలని సూచించారు. అనంతరం స్థానిక టీడీపీ నాయకులను ఎస్ఐలకు పరిచయం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత కొమరా వెంకటనరసయ్య, సిద్దవటం మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు శ్రీనివాసులునాయుడు, డాక్టర్ శివకుమార్, అడ్వకేట్ రామదాసు, రేవిళ్ల బాలమునెయ్య పాల్గొన్నారు.

బాలికలు మానసిక దృఢత్వం సాధించాలి

● చిల్డ్రన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రామలక్ష్మి


బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

ఓబులవారిపల్లె, ఆగస్టు 17 : బాలికలు మానసికంగా ధృఢంగా ఉండాలని, భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని కస్తూర్బా విద్యాలయంలోచి చిల్డ్రన్ ప్రొటెక్షన్ అధికారి రామలక్ష్మీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడబిడ్డలు మానసికంగా, శారీరకంగా ధృఢంగా తయారు కావాలంటే విద్య ఉత్తమ మార్గమని తెలిపారు. మగవారి స్నేహానికి, సెల్‌ఫోన్ వాడకానికి సుదూరంగా ఉండాలని అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రేవతి, ఎస్ఐ సూచించారు. 18 ఏళ్ల కన్న తక్కువ వయస్సులో పెళ్లి చేసుకుంటే ఎన్నో ఇబ్బందులు వస్తాయని, బాల్య వివాహాలు చేసుకోవడం శారీరక, మానసిక ఇబ్బందులు తలెత్తుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ తెలిపారు. బాల్య వివాహాలపైబాలికలు ముఖ్యంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. అవసరమైతే 1098, 112 నెంబర్లకు ఫోన్ చేసి సమస్య తెలిపితే ప్రభుత్వ అధికారులు రక్షణ కల్పిస్తారని ఏపీఎం ఆర్మగం, ఎంఈవో రెడ్డయ్య తెలియజేశారు. దేశంలో మహిళలకు రక్షణ కరవైందని వైద్య సిబ్బంది తెలిపారు. అలాగేపలువురు అదికారులు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కుటుంబంలో ఆడా మగ బిడ్డలకు ఇద్దరికి ఒకే ప్రాధాన్యం ఇవ్వాలని, మంచి చెడు విషయాలను తల్లిదండ్రులు వివరించాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదికారి రామ్మోహన్, సీహెచ్‌వో నాగేష్, జేవీ అరుణ, విద్యాశాఖ సిబ్బంది, పోలీసు సిబ్బంది, కస్తూర్బా విద్యాలయ ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు జాతీయ సమగ్రతపై దృష్టి సారించాలి



ప్రసంగిస్తున్న జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్

రాజంపేట, ఆగస్టు 17 : విద్యార్థులు జాతీయ సమగ్రతపై, దృష్టి సారించాలని రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసు పులేటి శంకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని రీజెన్సీ నలందా కళాశాలలో శనివారం జాతీయ సమగ్రత , వ్యక్తిత్వ వికాసంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏ భాష మాట్లాడినా ఏ ప్రాంతంవారైనా ఏ మతమైనా అందరూ భారతీయులేనన్న భావం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. భిన్నత్వంలో ఏకత్వం సాధించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, ప్రధానో పాధ్యాయురాలు స్వాతి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


పొందలూరు క్రాస్‌రోడ్డు వద్ద ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

పెనలూరు, ఆగస్టు 17 : మండల పరిధిలోని చక్రంపేట హైస్కూల్ సమీపంలో పొందలూరు క్రాస్‌రోడ్డు ఇరువైపులా రోడ్డు ఆక్రమణలను శనివారం ఆర్ అండ్ బి అధికారులు తొలగించారు. రాజంపేట - చిట్వేలి రహదారిలో పొందలూరు క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలపై గ్రామ ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు శనివారం రాజంపేట ఆర్ అండ్ బి డి.మనోహర్‌రెడ్డి, ఏఈ నారాయణరెడ్డి, జే.రాధ ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలు తొలగించారు. దీంతో రెండేళ్లుగా నలుగుతున్న సమస్య పరిష్కారమైంది. హైస్కూల్ సమీపం నుంచిశానం వరకు ఆక్రమణలు తొలగిస్తే బాగుంటుందని అధికారులకు తెలిపారు.

అన్నదానం గొప్ప పుణ్య కార్యక్రమం


అన్నదానం చేస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, ఆగస్టు17: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్ప పుణ్య కార్యక్రమం అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నేత సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. శ్రావణ మాసం 2వ శనివారం సందర్భంగా పట్టణంలోని ప్రసన్నాంజ నేయస్వామి ఆలయంలో టీడీపీ నేత మన్నేరు రామాంజనేయులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ప్రసాద్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యుడు వాకా అన్నయ్య, మన్నేరు రామాంజనేయులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సుగవాసి శ్రీనివాసులు, లాయర్ సతీశ్‌రెడ్డి, సురేంద్ర, బడిశెట్టి రవికుమార్, మంత్రి రెడ్డెయ్య, సుగవాసి ఈశ్వర్, యడం సుధీర్, భూపతి, వెంకటేశ్వర్లు, కటారు శివప్రసాద్, మన్నేరు రాజా, మన్నేరు శేఖర్, మన్నేరు శివ, కేసీ ప్రసాద్, సీవీ ప్రసాద్, త్యాగరాజు, ఏనుగుల విశ్వనాథ, పసుపులేటి నాగేంద్ర, రమణ, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

పెనగలూరు, ఆగస్టు 17 : వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురష్కరించుకుని శుక్రవారం రాత్రి పి.కొత్తపల్లెలో తలమంచి గిరీష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు నిర్మించిన వినాయకుడి మండపంలో మహిళలు వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. కొత్తపల్లె గ్రామ పెద్దలు, యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అభివృద్ధి చెందిన రాష్ట్రమే లక్ష్యంగా..



అధికారుల శిక్షణా తరగతుల్లో సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 17: 2047 సంవత్సరానికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చే లక్ష్యంలో అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో అధికారులకు శిక్షణా తరగతులు జరిగాయి. కలెక్టర్ మాట్లాడుతూ వికసిత్ ఆంధ్రప్రదేశ్ - 2047 అమలులో భాగంగా 2024-29కి 15శాతం అభివృద్ధి రేటుతో అంచనాలను సిద్ధం చేయాలన్నారు. తలసరి ఆదాయాన్ని రెట్టింపు చేయడం, పేదరికాన్ని నిర్మూలించడం ధ్యేయంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఆ దిశగా పనిచేయాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, డ్వామా పీడీ రాజశేఖర్, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్, ఆర్ అండ్ బీ ఎస్ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్, సీపీవో సాంబశివరెడ్డి, జడ్పీ సీఈవో గ్లోరియా, డీఆర్డీఏ పీడీ తులసి పాల్గొన్నారు.

యంత్రభూతానికి బలైన చిన్నారి



యంత్రంలో ఇరుక్కుపోయిన బాలిక, నవ్యశ్రీ(ఫైల్‌ఫొటో)

వాకాడు, ఆగస్టు 17 : కోలాటమాడడానికి వెళ్లిన ఓ చిన్నారి యంత్రభూతానికి బలైపోయింది.వాకాడులో ఏఎస్ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు... వెదురుకుప్పం మండలం మర్రిమాకుల కండ్రిగకు చెందిన బండి నవ్యశ్రీ (11) మరో 20మందితో కలసి తిరుపతి జిల్లా వాకాడులోని మహాలక్ష్మి ఆలయంలో తిరునాళ్లకు కోలాటం వేయడానికి శుక్రవారం వచ్చింది. కోలాటమాడి అలసిపోయిన ఆమె తెల్లవారుజామున జనరేటర్ పక్కనే పడుకుంది.అది ఓపెన్‌టైపు జనరేటర్ కావడంతో ఫ్యాన్‌లో పక్కనే పడుకొని ఉన్న నవ్యశ్రీ జడ చిక్కుకుంది. ఒక్కసారిగా తల మొత్తం జనరేటర్‌లోకి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది.విగతజీవిగా పడి ఉన్న నవ్యశ్రీని చూసి ఆమెతో వచ్చినవారు కన్నీరుమున్నీరయ్యారు.

జూపార్కులో త్వరలో తెల్లపులుల సఫారీ



జూపార్కులో ఏర్పాటు చేస్తున్న నాక్ టర్నల్ ఎన్‌క్లోజర్

మంగళం, ఆగస్టు 17: ఎస్వీ జూపార్కులో త్వరలో వైట్ టైగర్ సఫారీని తిరిగి ప్రారంభిస్తున్నట్లు జూపార్కు క్యూరేటర్ సెల్వం తెలిపారు. శనివారం జూపార్కులో మీడియాతో మాట్లాడుతూ.. 2018లో వైట్ టైగర్ సఫారీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కరోనా సమయంలో మూసి వేశామన్నారు. ఇపుడు సఫారీలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి, ప్రారంభిస్తామన్నారు. ఇందు కోసం రూ.85లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. అలాగే నాక్ టర్నల్(రాత్రి పూట తిరిగే జంతువులు, పక్షులు) ఎన్‌క్లోజర్ పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. వీటిలో పునుగు పిల్లులు, దేవాంగ పిల్లి, గుడ్లగూబ, తుమ్మల పందులు వంటి జంతువులను ఉంచుతామన్నారు. రూ.6కోట్ల బడ్జెట్‌తో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాజెక్టుకు టీటీడీ రూ.2కోట్లు మంజూరు చేయగా.. ఇపుడు రూ.4కోట్లు మంజూరు చేసిందన్నారు. ఏడు, ఎనిమిది నెలల్లో ఇది అందుబాటులో వస్తుందన్నారు. జిరాఫీలను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామని.. ఒక జత తెప్పించాలంటే రూ.3కోట్లు ఖర్చవుతుందని వివరించారు. మన జూపార్కులో రెండు జతల జిరాఫీల అవసరం ఉందన్నారు. జూపార్కుకు సందర్శకుల సంఖ్య కూడా పెరిగిందని తెలిపారు. వార్షిక ఆదాయం రూ.8.5కోట్లకు చేరుకుందని, ఈ సంవత్సరం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

స్టార్ ఎయిర్‌లైన్స్‌పై ప్రయాణికుల ఆగ్రహం



స్టార్ ఎయిర్‌లైన్స్ బుకింగ్ కౌంటర్ వద్ద ప్రయాణికుల నిరసన

రేణిగుంట, ఆగస్టు 17: స్టార్ ఎయిర్‌లైన్స్ విమానం రద్దు కావడంతో తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికులు నిరసన తెలిపిన ఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు... శనివారం ఉదయం బెల్గాం నుంచి 10.45 గంటలకు తిరుపతికి వచ్చి 11.45 గంటలకు తిరిగి స్టార్ ఎయిర్‌లైన్స్ విమానం బెల్గాం పోవాల్సివుంది. విమానం రద్దయిన విషయాన్ని ఉదయం ప్రయాణికులకు చెప్పకుండా మధ్యాహ్నం 1.30 గంటలకు చెప్పడంతో అప్పటి వరకు వేచివున్న ప్రయాణికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సుమారు 45 నిమిషాల పాటు స్టార్ ఎయిర్‌లైన్స్ బుకింగ్ కౌంటర్ వద్ద సంస్థ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.తరచూ ఇలా జరగడం వల్ల ప్రయాణికులు సంస్థ పట్ల నమ్మకం కోల్పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



యాగశాలలో హోమాలు నిర్వహిస్తున్న ఋత్వికులు

తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం యాగశాలలో ఋత్వికులు హోమాలు నిర్వహించారు. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపుతో అభిషేకించి చివరగా చందనం పూత పూశారు. ధూపదీప హారతులు నివేదించారు. సాయంత్రం ఉత్సవమూర్తులు ఆలయ మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తర్వాత పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం విమాన ప్రదక్షిణగా ఉత్సవమూర్తులు ఆలయ ప్రవేశం చేయడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈకార్యక్రమ నేపథ్యంలో ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.టీటీడీ జీయర్ స్వాములు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.



స్వామి వారి ఊరేగింపు - స్కందపుష్కరిణిలో స్వామి విహారం

ఘనంగా వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు

వెదురుకుప్పం, ఆగస్టు 17: కార్వేటినగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ తెప్పోత్సవాల కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి శుద్ధి, తోమాల,మొదటి గంగ, సర్వదర్శనం కార్యక్రమాలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో వేడుకను వీక్షించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాల మధ్య తిరువీధి ఉత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులు మొక్కులు చెల్లించుకున్నారు. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి, సంగీత కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాల్లో టీడీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, సిబ్బంది, ప్రధాన అర్చకులు హాజరయ్యారు. రాత్రి సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి స్కందపుష్కరిణిలో విహరించారు. తెప్పోత్సవ సందర్భంగా భక్తులు స్కందపుష్కరిణి వద్ద కర్పూర హారతులు ఇచ్చారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ అధికారి సురేష్‌కుమార్, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ప్రధాన అర్చకులు గోపాల ఆచార్యులు, శబరి, రమేష్, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ట్రాక్టర్ చోరీ కేసులో వైసీపీ మండల కన్వీనర్ అరెస్టు



కుప్పం అర్బన్ పోలీసు స్టేషన్ వద్ద మురుగేశ్, వైసీపీ నేతలు

కుప్పం, అగస్టు 17: పంచాయతీకి చెందిన ట్రాక్టర్ చోరీ కేసులో వైసీపీ కుప్పం మండల కన్వీనర్ హెచ్‌ఎం.మురుగేశ్ అరెస్ట్ అయ్యారు. గత ఏడాది పంచాయతీ ట్రాక్టర్ చోరీకి గురైంది. దీనిపై అప్పట్లోనే పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పుడు పోలీసులు విచారించగా ట్రాక్టర్ వైసీపీ మండల కన్వీనర్ అధీనంలో ఉన్నట్లు తెలిసింది. ఆయన దాన్ని సొంత పనులకు వినియోగించుకోవడం బయటపడింది. కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడు మురగేశ్‌ను అరెస్టు చేసి, కోర్టు ముందు హాజరుపరిచారు. కోర్టు ఆయనకు 15రోజుల రిమాండ్ విధించింది. అలాగే ఆయనపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదైంది. కుప్పం మండలంలోని మల్లానూరు పంచాయతీలో ఈనెల 9వ తేదీన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తనను మురుగేశ్ కులం పేరుతో దూషించారని ఎమ్మార్పీఎస్ నాయకుడు ప్రకాశ్ కుప్పం అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన పోలీసులు మురుగేశ్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

అన్న చేతిలో తమ్ముడి హతం



రక్తపు మడుగులో పడి ఉన్న చెంగప్ప

పెద్దపంజాణి, ఆగస్టు 17: అన్న చేతిలో తమ్ముడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన పెద్దపంజాణి మండలం మట్టిగానిపల్లెలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మట్టిగానిపల్లెకు చెందిన వెంకట్రమణ, చెంగప్ప(55) అన్నదమ్ములు. వీరి మధ్య ఆస్తి తగాదాలున్నాయి. ఘర్షణ పడుతుండేవారు. పలుమార్లు గ్రామస్తులు పంచాయతీలు నిర్వహించి సర్దుబాటు చేస్తూ వచ్చారు. అయినా వైరం పెరుగుతూనే వచ్చింది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం పొలం వద్ద ఇద్దరూ ఘర్షణపడ్డారు. సాయంత్రం ఇంటివద్ద చెంగప్ప కూర్చుని ఉండగా అన్న అయిన వెంకట్రమణ వెనుక నుంచి వచ్చి కత్తితో దాడిచేశాడు. గాయపడ్డ చెంగప్ప రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి మతిస్థిమితం లేని కుమారుడు ఉన్నాడు. గంగవరం సీఐ మురళీమోహన్, పెద్దపంజాణి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఆటోను ఢీకొన్న కారు : 10మందికి గాయాలు



కేజీ సత్రం వద్ద ఆటోను ఢీకొన్న కారు

బంగారుపాళ్యం, ఆగస్టు 17: చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని కేజీ సత్రం వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో 10 మంది గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వి.కోట మండలం మడమందిరం గ్రామానికి చెందిన కొందరు యాదమరి మండలంలోని ఓటేరిపల్లిలో పూజాకార్యక్రమానికి ఆటోలో వెళ్తున్నారు. కేజీ సత్రం మలుపు వద్ద ఆటోను బెంగళూరు వైపు నుంచి చిత్తూరు వెళ్తున్న కారు ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న శివ, చిన్నమ్మ, రాజేష్, సురేష్, నాగరాజు, బాలప్ప, చరబండ్, కేశవలతో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 పైలట్ క్రిష్ణమూర్తి, అములు త్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



రాకెట్, గ్రహసంచార, రోబో నమూనాలతో విద్యార్థులు

ఐఐటీలో అంతరిక్ష దినోత్సవం

ఏర్పేడు, ఆగస్టు 17: శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశిష్ట సేవలందించిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు ఇస్రో అధికారి డాక్టర్ మనీష్ సక్సేనా సూచించారు.జాతీయ అంతరిక్ష దినోత్సవ సందర్భంగా ఏర్పేడులోని ఐఐటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్, నవవిష్కార్ ఐ-హబ్ ఫౌండేషన్ కలసి సెలబ్రేటింగ్ స్పేస్ అండ్ ఇంటర్‌స్టెల్లార్ ఫెస్ట్ ఫర్ స్కూల్ పేరుతో శనివారం ఓ కార్యక్రమాన్ని ఐఐటీలో నిర్వహించారు.26 ప్రైవేటు పాఠశాలలతో పాటు 6 ప్రభుత్వ పాఠశాలల నుంచి వెయ్యిమందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. బెంగళూరు ఇస్రో ప్రధాన కార్యాలయ శాటిలైట్ నావిగేషన్ ప్రోగ్రాం ఆఫీస్ డైరెక్టర్ డాక్టర్ మనీష్ సక్సేనా , శ్రీహరికోట ఎస్‌డీఎస్‌సీలోని పీసీక్యూజ, సాలిగ్ మోటార్స్ ప్రొపెలెంట్ కాంప్లెక్స్ చీఫ్ జనరల్ మేనేజరు డాక్టర్ టీవీ రమణారెడ్డి తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనల గురించి వివరించారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ,నవవిష్కార్ ఐహబ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాత్సవ నావిగేషన్ ప్రాముఖ్యతను వివరించారు. 80మంది విద్యార్థులు ప్రసంగ పోటీల్లో, 120మంది విద్యార్థులు క్విజ్ పోటీల్లో, 150మంది విద్యార్థులు డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్నారు.సౌరవ్యవస్థ, స్పేస్‌కాలనీ మోడల్, గ్రహాల వ్యవస్థ, కాంతి, నీడలపై తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆదివారం సాయంత్రం బహుమతులను అందజేయనున్నారు.

సమయానికి జీతాలు తీసుకున్నట్టే పనులు కూడా చేయండి

● విద్యుత్ అధికారులకు ఎస్ఈ సురేంద్రనాయుడు హెచ్చరిక



అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ సరేంద్రనాయుడు

చిత్తూరు రూరల్, ఆగస్టు 17: సమయానికి జీతాలు తీసుకుంటున్నట్టే పనులు కూడా అదే తరహా చేయాలంటూ విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్ర నాయుడు తమ సిబ్బందిని మందలించారు. చిత్తూరు రూరల్ డివిజన్ కార్యాలయంలో శనివారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయడం లేదని తనకు సమాచారముందన్నారు. ఇకనైనా మారకుంటే సస్పెండ్ తప్పదని హెచ్చరించారు. చాలా మంది అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. బుధవారం నిర్వహించే విద్యుత్ శాఖ గ్రీవెన్స్ డే అధిక సంఖ్యలు ఫిర్యాదు వస్తున్నాయన్నారు. వాటిని పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో సక్రమంగా పనులు చేస్తే ఫిర్యాదులు ఎందుకు వస్తాయని ప్రశ్నించారు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు ఏఈలను ఇప్పటికే పక్కన పెట్టామనే విషయాన్ని గుర్తు చేశారు.

పాళ్యంకొండలో గుప్తనిధుల కోసం తవ్వకాలు



తవ్వకాలకు ప్రయత్నిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు

గుడిపాల, ఆగస్టు 17: మండలంలోని మారుమూల ప్రాంతమైన నారగల్లు రెవెన్యూకు సంబంధించి ఆంజనేయస్వామి ఆలయ భూముల్లో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధులకోసం తవ్వకాలు జరిపారు. వీరిని గమనించిన గ్రామస్థులు పట్టుకునేందకు ప్రయత్నించారు. అయితే అప్పటికే వారు తప్పించుకుని పారిపోయారు. పౌర్ణమి, అమవాస్య రోజుల్లో ఈవిధంగా తవ్వకాలు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు.

పావురాల కోసమెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్నాడు

విద్యుత్ వైర్లపై పడి బాలుడి మృతి





విద్యుత్ వైర్లపై వేలాడుతున్న దౌలాత్ - దౌలాత్(ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, ఆగస్టు17: పావురాల కోసం వెళ్లి బాలుడు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన శనివారం పుంగనూరులో చోటుచేసుకుంది. కొత్తపేటకు చెందిన మాజీ సైనికుడు రఫిక్ కుమారుడు దౌలాత్(13) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఇంటి పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పావురాలను గమనించాడు. వాటిని పట్టుకునే ప్ర యత్నంలో వైర్లపై పడ్డాడు. చుట్టుపక్కల వారు గుర్తించి, కేకలు వేయడంతో విద్యుత్ శాఖాధికారులు అక్కడికి చేరుకుని బాలుడికి కిందకు దించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ అలీంబాషా ఘటనా స్థలానికి చేరుకుని ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు. సహాయ సహాకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ముగ్గురు సీఐలకు పోస్టింగ్

చిత్తూరు, ఆగస్టు 17: జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీల్లో వీఆర్‌లో ఉన్న ముగ్గురు సీఐలకు శనివారం పోస్టింగ్‌లు కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వారిని అన్నమయ్య జిల్లాకు బదిలీ చేసింది. విశ్వనాథరెడ్డిని రాయచోటి ట్రాఫిక్‌కు బదిలీ చేసింది. అలాగే రవిశంకర్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా దిశ-1కు, మద్దయ్య ఆచారిని స్పెషల్ బ్రాంచి-2కు బదిలీ చేసింది.

దోషులను కఠినంగా శిక్షించాలి

● కోల్‌కత్తాలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటనను ఖండిస్తూ పెల్లుబుకిన నిరసనలు ● నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టిన వైద్యులు, సిబ్బంది


మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న ఐఎంఏ వైద్యులు


పీలేరులో నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్య సిబ్బంది

మదనపల్లె టౌన్, ఆగస్టు 17: కోల్‌కత్తాలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మదనపల్లెలో పలు సంఘాలు నిరసనలు, ధర్నాలు నిర్వహించారు. సభ్య సమాజం తలదించుకునేలా జరిగిన ఈ సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలంటూ పెద్దఎత్తున నిరసనలు పెల్లుబుకాయి, శనివారం స్థానిక సర్వజన బోధనాస్పత్రి వద్ద ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు నల్లబాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వెంకటరమణారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ప్రశాంత్ గుప్తా మాట్లాడుతూ ఐఎంఏ పిలుపుమేరకు శనివారం ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అత్యావసర వైద్యసేవలు మినహా, మిగిలిన వైద్యసేవలు నిలిపివేస్తున్నామన్నారు. ట్రైనీ వైద్యురాలిని దారుణంగా హత్యాచారం చేయడం సభ్య సమాజం సిగ్గుతో తలవంచుకునేలా చేసిందని ఇప్పటి వరకు పోలీసుల దర్యాప్తు సంతృప్తికరంగా లేదని, ఈ కేసును సీబీఐకు అప్పగించాలని కోల్‌కత్తా హైకోర్టు పోలీసులకు సూచించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలను సవరించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి నుంచి సబ్ కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సర్వజన బోధనాస్పత్రి వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ఉదయం 9 నుంచి 10గంటలకు వరకు నిరసనలు తెలిపిన అనంతరం ఓపీడీ విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కోశాధికారి డాక్టర్ ఆనందబాబు, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ చంద్రమో హన్, డాక్టర్ సురేంద్రబాబు, డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ శైలజదేశాయ్ పాల్గొన్నారు.

● కాగా దేశంలో సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టాన్ని తీసుకురావాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.చలపతి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు, ధర్నా నిర్వహించారు. దేశంలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయే కాని, వాటిని దిశా, నిర్భయ, ఫోక్సో చట్టాలు ఏమి చేయలేకపోతున్నాయన్నారు. డబ్బున్న వారి చేతిలో ఈ చట్టాలు చుట్టాలుగా మారిపోతున్నాయని విమర్శించారు. అందుకే దేశ వ్యాప్తంగా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకొచ్చి అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు రామానాయుడు, మురళి, గంగారాణి, మాధవ్, వినయ్, కమలాకర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

●వైద్యురాలిపై హత్యాచారం కేసును పోలీసులు పక్కదోవ పట్టిస్తున్నారని ఐద్వా సంఘం అధ్యక్షురాలు భాగ్యమ్మ ఆరోపించారు. శనివారం స్థానిక రామారావు కాలని వద్ద ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యమ్మ మాట్లాడుతూ విధులు పూర్తి చేసుకుని విశ్రాంతి తీసుకుంటున్న పీజీ వైద్యురాలిపై హత్యాచారం జరిగిందని, ఈ ఘటనలో ఎక్కువ మంది కారణమై ఉంటారన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో పోలీసుల నాన్చుడు దోరణి విడనాడాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా సభ్యులు షాహినా, రెడ్డిప్రసన్న, గాయత్రి, అంజలి, శాంతమ్మ పాల్గొన్నారు.

పీలేరులో: కోల్‌కత్తాలోని జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా శనివారం పీలేరు పట్టణంలోని వైద్యులు, వైద్య సిబ్బంది నల్లదుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన, ఆ ఘటనకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఆర్‌జీకర్ వైద్య కళాశాల సిబ్బందిపై గుర్తు తెలియని దుండగుల దాడికి వ్యతిరేకంగా శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అన్ని ఆసుపత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేసి నిరసన తెలపాలన్న ఐఎంఏ నిర్ణయంలో భాగంగా పీలేరులోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేశారు. ఈ సందర్భంగా పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన కార్యక్రమంలో ఐఎంఏ పీలేరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, పవన్ కుమార్ మాట్లాడుతూ జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరగడం అమానవీయమని, మందకొడిగా సాగుతున్న ఆ కేసు విచారణను వేగవంతం చేయాలన్నారు. ఓపీ సేవలు నిలిపివేయడ తమ ఉద్యమంలో తొలి అంకమని, ఆ కేసులో సత్వర న్యాయం జరగకపోతే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. అదే విధంగా వైద్యుల రక్షణ చట్టాన్ని పటిష్ఠం చేయాలని, వైద్యులపై దాడులు చేసిన వారిని ఫాస్టు ట్రాకు కోర్టుల ద్వారా విచారించి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. అనంతం స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి నిందితులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాజాసాహెబ్, ఈశ్వర్ సురేంద్ర, శ్రీలత, నాగవేణి, మంజుల, విజయలక్ష్మి, శ్రీనివాస్, సోమశేఖర రెడ్డి, శివయ్య, హరీష్, వసీం, శశిభూషణ్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, అదీబ్ ఖాన్, శ్వేత, శశిధర్ రెడ్డి, సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో : కోల్‌కత్తాలో ఓ మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ శనివారం మండల కేంద్రమైన పీటీఎంలో వైద్యులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. కలకత్తాలో జరిగిన ఘటన సభ్య సమాజం తలదించుకునే ఘటన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యాచార ఘటనలో నింది తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్ర మంలో డాక్టర్ అఫ్షాఖాన్, నాగరాజు, చంద్ర ,సిస్టర్ శిరీషా పాల్గొన్నారు.

కలికిరిలో: కోల్‌కత్తా వైద్యురాలి హత్యాచార ఘటనను నిరసిస్తూ మండలంలో వైద్యులు, వైద్య సిబ్బంది శనివారం వైద్య సేవలను బహిష్కరించారు. ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ పట్టణంలో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కారణంగా సాధారణ వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. కలికిరి సామాజిక వైద్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పవన్ కుమార్, మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చిన్నరెడ్డెప్పల ఆధ్వర్యంలో వివిధ విభాగాల సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాఘటనకు నిరసనగా పెద్దమండ్యం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెద్దమండ్యం ఆరోగ్య వైద్య శాఖ అధికారులు మాట్లాడుతూ వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటనపై ఖండించారు. అలాంటి సంఘటన పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెద్దమండ్యం వైద్యాధికారులు ఇమ్మానుయేల్, హరివర్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: కోల్‌కత్తాలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం హత్యాఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి వెంకట్రామయ్య, వైద్యులు డిమాండ్ చేశారు. శనివారం ఈ సంఘటనకు వ్యతిరేకంగా ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు చేతబట్టి ఆసుపత్రి వద్ద నుంచి పట్టణంలోని మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వైద్యులు విక్రాంత్‌రెడ్డి, అమరసింహరాజు, హెడ్ నర్సులు గ్లోరి, రాధ, లీలావతి, ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్, సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: కోల్‌కత్తాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా శనివారం వాల్మీకిపురంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక వైద్యులు, సిబ్బంది విధులు బహిష్కరించి నల్లబ్యాడ్జీలు ధరించి ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ వైద్యులు మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రులలో సైతం రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కలకత్తా ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలకు చోటివ్వకుండా శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజాబేగం, డాక్టర్లు హర్షితారెడ్డి, శివాణి, ఆసీఫ్, మమత, సోని, శ్రీలక్ష్మి, హిమబిందు, రవికుమార్, స్థానిక వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: కోల్‌కత్తాలో పీజీ వైద్య విద్యార్థిని పై అత్యాచారం చేసి హత్య చేసినందుకు నిరసనగా బి.కొత్తకోట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ కిరణకుమార్‌తో పాటు డాక్టర్ హసీనా, ఆరిఫ్‌లు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిని అత్యంత దారుణంగా అత్యాచారం చేసి, ప్రాణాలు కూడా తీసిన సంఘటనపై సమాజం సిగ్గుతో తలవంచుకోవాలన్నారు. ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


వాల్మీకిపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది


కలికిరిలో ప్రదర్శన చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది


తంబళ్లపల్లెలో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

విద్యార్థులకు సులభరీతిలో పాఠాలను బోధించండి


వంట గదిలో భోజన మోనూను పరిశీలిస్తున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

కలకడ, ఆగస్టు 17:విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా పాఠాలను బోధించాలని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన బాటవారిపల్లె హైస్కూల్‌లో కలకడ, కలికిరి మండలాల ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ సమావేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్య, పీరియడ్ ప్రణాళిక, డైరీలను అమలు చేయాలన్నారు. అనంతరం కస్తూరిబా పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయులను సమావేశ పరిచి అమలవుతున్న సీబీఎస్ఈ సిలబస్ గురించి చర్చించారు. తరగతి గదులకు వెళ్లి స్టూడెంట్స్ కిట్స్, భోజన వసతి సదుపాయాలను ఆరాతీశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో మునీంద్ర నాయక్, రామచంద్రారెడ్డి, హెచ్ఎం సరస్వతమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో వాయిదా పడిన ఎస్ఎంసీల ఎన్నిక పూర్తి


కన్నెమడుగు హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం

తంబళ్లపల్లె, ఆగస్టు 17: తంబళ్లపల్లె మండలంలో వాయిదా పడిన కన్నెమడుగు ఉన్నత పాఠశాల, ఎద్దులవారికోట ప్రాథమిక పాఠశాల యాజమాన్య (ఎస్ఎంసీ) కమిటీలు పూర్తి అయినట్లు ఎంఈవో త్యాగరాజు తెలిపారు. పది రోజుల కిందట మండలంలోని 68 పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించగా..66 పాఠశాలల్లో కమిటీలు పూర్తయ్యాయి. మిగిలిన కన్నెమడుగు హైస్కూల్, ఎద్దులవారికోట ప్రాథమిక పాఠశాలల్లో పలు విబేదాలతో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది. దీంతో ఈ రెండు పాఠశాలల్లో శనివారం ఆయా పాఠశాలల హెచ్ఎంలు మదన్‌మోహన్, లలితాబాయ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. కన్నెమడుగు హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్‌గా ఓ.రెడ్డిశేఖర్, వైస్ చైర్మన్‌గా డి.వనిత.. ఎద్దులవారికోట ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా వై.మల్లికార్జున, వైస్ చైర్మన్‌గా బి.సరోజ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పాఠశాలల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత మంత్రి గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు, కురబలకోట మండలాధ్యక్షుడు వైజి సురేంద్ర, బీజేపీ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి జెరిశీన, టీడీపీ గ్రామాధ్యక్షుడు సురేంద్ర, సోముశేఖర్, ఉత్తమ్‌రెడ్డి, వెంకట్రమణ, పురుషోత్తం, ఆనంద్‌నాయుడు, స్వామిరెడ్డి, నరేంద్రనాయుడు, మల్లి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని ఆపాలని ఈవోకు ఫిర్యాదు

పీలేరు, ఆగస్టు 17: రోడ్డుకు అడ్డంగా జరుగుతున్న ఓ భవన నిర్మాణాన్ని వెంటనే ఆపాలని పీలేరు పట్టణం అజంతా టాకీసు, లక్ష్మీపురం కాలనీ వాసులు శనివారం పీలేరు గ్రామ పంచాయతీ ఈవోకు వినతిప త్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు పట్టణానికి ప్రధాన రహదారి అయిన ఎల్‌బీఎస్ రోడ్డు నుంచి అజంతా టాకీసు, లక్ష్మీపురం, సుందరరాజులు శెట్టి వీధి, ఎర్రమరెడ్డి గుట్ట ప్రాంతాలను కలిపే దారిని కె.మెహజబీన్, కె.అదీబ్ ఖాన్ అనే వారు ఆక్రమించుకుని సుమారు 5 అంతస్థుల భవ నాన్ని నిర్మిస్తున్నారని వారు తెలిపారు. సుమారు 10 వేల జనాభా ఉన్న తమ ప్రాంతాల కు ముఖద్వారం ఉండే రోడ్డును వారిద్దరూ ఎవరు చెప్పినా వినకుండా ఆక్రమించు కున్నారని తెలిపారు. ఆ 5 అంతస్థుల భవనానికి సైతం ప్రభుత్వ అనుమతులు లేవని నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఆ భవన నిర్మాణాన్ని వెంటనే ఆపాలని వారు డిమాండ్ చేశారు. రెండు, మూడు రోజుల్లో తాము స్వయంగా స్థలపరిశీలన జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఈవో గురుమోహన్ తెలపడంతో వారు వెనుదిరిగారు.

క్రమశిక్షణ, కార్యకర్తల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం


మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, ఆగస్టు 17: క్రమశిక్షణ, కార్యకర్తల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు పనిచేస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి కూటమి గెలుపే దీనికి నిదర్శనమన్నారు. కొంత మంది గిట్టని వారు గోబెల్స్ ప్రచారం చేయిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షుడు మదనపల్లె పర్యటనకు వస్తే ఇక్కడ ఏదేదో జరిగిపోయిందని గగ్గోలు పెడుతూ అసత్య ప్రచారాలు చేశాయడం తగదన్నారు. మైనారిటీ నాయకుడు అన్వర్‌బాషా తన వ్యక్తిగత సమస్య చెప్పుకోవడానికి జిల్లా పార్టీ అధ్యక్షుడిని కలిస్తే, కొందరు దీన్ని వక్రీకరించి ఎమ్మెల్యే కు తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు అన్వర్‌బాషా, భువనేశ్వర్‌రెడ్డి, రామ్మూర్తి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయి కౌలు రైతులకు న్యాయం చేయాలి


తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కలికిరి, ఆగస్టు 17: నకిలీ విత్తనాలు, మోస పూరిత బొప్పాయి మొక్కల సరఫరా కారణాలతో తీవ్రంగా నష్టపోయిన బొప్పాయి కౌలు రైతులను ఆర్థికంగా ఆదుకుని న్యాయం చేయాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి రంగారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు టీఎల్ వెంకటేష్‌లు తహసీల్దారును కోరారు. ఆ మేరకు నష్టపోయిన కౌలు రైతులతో కలిసి శనివారం కలికిరి తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. మండలానికి చెందిన కౌలు రైతులు పరిసర మండలాల్లో భూములను కౌలు తీసుకుని బొప్పాయి సాగుచేశారని నకిలీ మొక్కలను నాటడం ద్వారా పూర్తిగా పంట నష్టపోయారన్నారు. కౌలు రైతు లకు నష్టపరి హారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ వివిధ శాఖల అధికారులకు విన్నవించినా కౌలు రైతులకు న్యాయం జరగడం లేదని చెప్పారు. తహసీల్దారయినా స్పందించి ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతులు రమణరాజు, రెడ్డెప్ప, రమణయ్య, ఆదినారాయణ, నరసింహులు, నాగమోహన్ పాల్గొన్నారు.

అమూల్ పాల డెయిరీని కొనసాగించాలని నిరసన



నిరసన తెలియజేస్తున్న రైతు సంఘం నాయకులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు17: అమూల్ పాలడెయిరీని యధావిధిగా కొనసాగించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. మదనపల్లెలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం అంగన్వాడీ సెంటర్లు అమూల్ డెయిరీ పాలు కొనుగోలు చేయకపోవడంతో సేల్స్ పడిపోయి యాజమాన్యం రైతులకు రేట్లు తగ్గించిందన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానా యుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, చంద్రగిరి నియోజకవర్గ కార్యదర్శి బండి చలపతి, మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళీ, మాధవ్, రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి స్థాపనకు కృషి చేయాలి


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న యోగా గురువు బ్రహ్మకుమార్

కురబలకోట, ఆగస్టు 17: ప్రపంచ శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యోగా గురువు బ్రహ్మకుమార్ శాంతాకృష్ణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులకు మెడిటేషన్, యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎటువంటి ఘర్షణలు లేని శాంతియుత సమాజాన్ని స్థాపించాలని దానికి విద్యార్థులు తమ వంతు పాటుపడాలన్నారు. ఏకాగ్రతతో ఆలోచించి ముందుకెళ్లాలన్నారు. ధ్యానం చేయడం వలన అనేక ఒత్తిడిల నుంచి తేలిగ్గా ఉపశమనం పొందవచ్చన్నారు.

వయ్యారి భామ కలుపుతో వ్యవసాయనికి కష్టాలు

కలికిరి, ఆగస్టు 17: వయ్యారిభామ కలుపు మొక్కలు వ్యవసాయంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు చూపిస్తూ అరిష్టంగా తయారయ్యాయని కేవీకే శాస్త్రవేత్త ఎస్.సోమశేఖర్ బాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు వయ్యారి భామ మొక్కల ప్రభావ తీరుతెన్నులపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ గడ్డి, క్యారెట్ గడ్డి, ముక్కుపుల్ల చెట్లు, పార్థీనియం, వయ్యారిభామ వంటి కలుపు మొక్కలు మనుషులకు చర్మ, ఊపిరితిత్తుల వ్యాధులు వ్యాప్తి చేస్తాయన్నారు. వీటిని పీకేసి కాల్చివేయడం ఒక పరిష్కారమన్నారు. జీవ నియంత్రణ పద్దతిలో జైగోగ్రామైకొలరేట అనే పురుగులను వదిలి కూడా నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నెమడుగు సర్పంచ్ శ్యామలమ్మ మృతి



తంబళ్లపల్లె, ఆగస్టు 17: తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు సర్పంచ్ డి.శ్యామలమ్మ(70) అనారోగ్యంతో శనివారం తెల్లవారు జామున మృతి చెందారు. ఈమె మూడు నెలల క్రితం అనారో గ్యం కారణంగా బెంగళూరు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఏవి లక్ష్మీదే వమ్మ, పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు శ్యామలమ్మ భౌతికకా యాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆదివారం కన్నెమడుగు వారి వ్యవసాయక్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 17: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. అమ్మచెరువు మిట్ట, ఏసీ గోదామ్ సమీపంలోని సాంబశివ కుమార్తె(17) స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

బి.కొత్తకోట సీఐగా రాజారెడ్డి

బి.కొత్తకోట, ఆగస్టు17: బి.కొత్తకోట నగరపంచాయతీ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా నియమితులైన రాజారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా నంద్యాల టుటౌన్ సీఐగా పనిచేస్తూ బదిలీపై ఆయన బి.కొత్తకోట పట్టణానికి నూతన సీఐగా నియమితులయ్యారు. కాగా ఇంతకాలం ఇక్కడ సీఐగా పని చేసిన సూర్యనారాయణ వీఆర్ కు వెళ్లారు.

నిమ్మనపల్లి ఎస్ఐగా తిప్పేస్వామి

నిమ్మనపల్లి, ఆగస్టు 17: నిమ్మనపల్లి ఎస్ఐగా తిప్పేస్వామి శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పని చేసిన లోకేష్‌రెడ్డి తంబళ్లపల్లికి బదిలీపై వెళ్లగా ములకలచెరువులో ఎస్ఐగా పనిచేసిన తిప్పేస్వామి నిమ్మనపల్లికు బదిలీపైవచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమరవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకొంటామాన్నారు.

ఘనంగా తోల్ తిరుమావళవన్ జన్మదిన వేడుకలు

పీలేరు, ఆగస్టు 17: విడుదలై చిరుతైగల్ కచ్చి(వీసీకే) పార్టీ జాతీయ అధ్యక్షుడు, తమిళనాడులోని చిదంబరం పార్లమెంటు సభ్యుడు అయిన తోల్ తిరుమావళవన్ 62వ జన్మదినాన్ని పీలేరులోని ఆ పార్టీ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ లక్ష్మీ వృద్ధాశ్రమంలో అన్నదానం చేపట్టారు. వీసీకే పార్టీ, 'బాస్' నేత పాలకుంట శ్రీనివాసులు నాయకులు, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు విజయకుమారి పాల్గొన్నారు.

పల్స్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

ములకలచెరువు, ఆగస్టు 17: గ్రామాల్లో జరుగుతున్న పల్స్ తోడు సర్వేలను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో పోలప్ప ఆదేశించారు. ములకలచెరువులోని నట్టగుట్టలో జరుగుతున్న సర్వేలను శనివారం ఆయన తనిఖీ చేశారు. అలాగే స్థానిక ఉర్దూ స్కూల్‌లో మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఈవోఆర్డీ మోహన్ ప్రతాప్, సిబ్బంది ఉన్నారు.

బీసీ సదస్సును విజయవంతం చేయండి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 17: విజయవాడలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించే బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ పిలుపుపిచ్చారు. బీసీ సమావేశం కరపత్రాలను శనివారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో వివిధ బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాలో మాట్లాడుతూ బీసీల జన గణన చేసి బీసీల జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. దీని కోసం విజయవాడలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి బీసీ కులాలు నాయకులు, కులస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ వాల్మీకి సంఘం రాష్ట్రఅధ్యక్షుడు పులి శ్రీనివాసులు, రజక సంఘం నాయకుడు శివ, ఈడిగ సంఘం అధ్యక్షుడు ప్రసాద్, నాయీబ్రాహ్మణ సంఘం నాయకుడు అరుణ్, మేదర సంఘం నాయకుడు అర్జున్, వడ్డెర సంఘం నాయకుడు ప్రసాద్, తొగటవీర సంఘం నాయకుడు రవితేజలతోపాటు బీఎస్పీ నాయకులు బాలాజీ, శివ, సంధ్య, కిషోర్, సోముశేఖర్, మల్లికార్జున, చంద్ర,హరి, మహేష్‌లు పాల్గొన్నారు.

బెంగళూరు నుంచి హార్స్‌లీ హిల్స్‌కు సైకిలింగ్



బి.కొత్తకోట, ఆగస్టు17: కర్ణాటక రాజధాని బెంగళూరు నుంచి 80 మందితో కూడిన యువకుల బృందం సైకిళ్లపై శనివారం హార్స్‌లీహిల్స్ కు చేరుకున్నారు. వారాంతంలో బెంగళూరు నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మెడిసిన్ విద్యార్థులు పెద్దసంఖ్యలో హార్స్‌లీహిల్స్ కు రావడం పరిపాటిగా మారింది .ఈ నేపథ్యంలో బెంగళూరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహించిన సైకిలింగ్ ఈవెంట్‌లో సుమారు 80 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. ఉదయం 6గంటలకు బెంగళూరులో బయలుదేరి మధ్యాహ్నం 2.30 కి సైకిళ్లపై హార్స్‌లీహిల్స్ కు చేరుకున్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



మదనపల్లె అర్బన్, ఆగస్టు 17: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గత ఏడాది 9వ తరగతి పరీక్షలలో రాణించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థిని, తమ కుటుంబ సభ్యురాలైన కోసూరు నళిని స్మారక అవార్డులను గత ఏడాది మంచి మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులు జకియా, రోహిత్ కుమార్, షభానా, దీక్షిత్ సాయిలకు ఒక్కొక్కరికి రూ.5000లు, జ్ఞాపికలు, సర్టిఫికేట్స్, అందజేసారు . ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు , పోర్డ్ డైరెక్టర్ లలితమ్మ, రాష్ట్ర ఉర్దూ టీచర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్‌ఖాన్ , ఉపాధ్యాయులు అభినందించారు.

మానవ మృగాలను ఉరితీయాలి


మృతురాలి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైద్యులు, ప్రజాసంఘాల నేతలు

పీలేరు, ఆగస్టు 17:కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేసిన మానవ మృగాలను ఉరితీయాలని వైద్యులు, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆమేరకు నిరసిస్తూ శనివారం సాయంత్రం పీలేరు పట్టణంలోని వైద్యులు, ప్రజాసంఘాల నేతలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన మానవ మృగాలను గుర్తించి వారిని బహిరంగంగా ఉరితీయాలని ఈ సందర్భంగా పలువురు డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు కొవ్వొత్తుల ప్రదర్శ చేపట్టి నాలుగు రోడ్ల కూడలిలో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ప్రజాసంఘాల నేతలతోపాటు మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కత్తాలోని ఆర్‌జీఆర్ మెడికల్ కాలేజీలో మహిళా డాక్టర్‌పై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణప్ప డిమాండ్ చేశారు. శనివారం స్థానిక టమోటా మార్కెట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతావనిలో ఆడబిడ్డలకు రక్షణ లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలతో సంబంధంలేకుండా అలాంటి క్రూరమృగాలను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ, ఏఐటీయూసీ మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళి, పట్టణ కార్యదర్శి తిరుమల, ముబారక్, దేవా, వాసు, రెడ్డెప్ప, రెడ్డి, అనుసూయ, రెడ్డెమ్మ, తదితరులు పాల్గొన్నారు.


మార్కెట్ యార్డు వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మండల అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష

బి.కొత్తకోట, ఆగస్టు17: బి.కొత్తకోట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల అధికారులతో ఎంపీడీవో శంకరయ్య అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పురోగతిని, విడుదలైన నిధులు, చేపట్టిన పనుల గురించి వివరించారు. నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చే విధంగా అధికారులకు ప్రజాప్రతినిధులు సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుడుం శ్రీనివాసులు, నారాయణ స్వామిరెడ్డి, ఎంఈవో రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.